Jai Bhavani
CITY PLANNERS
AutoDCR ONLINE, BUILDING PERMISSION, UP LOADING & Pre DCR, CAD DRAWINGS
LRS, BRS, FIRE NOC
BUILDING PLANS, CONSTRUCTIONS & INTERIOR DESIGN
Ph: 040-24141785, Cell: 9966405785
Email : citytimestd@gmail.com

RNI No: TELTEL/2021/81803

మెట్రో సిటీ టైమ్స్

METRO CITY TIMES Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 | సంచిక : 145 | రంగారెడ్డి | శుక్రవారం, ఫిబ్రవరి 6, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

Jai Bhavani
CITY PLANNERS
AutoDCR ONLINE, BUILDING PERMISSION, UP LOADING & Pre DCR, CAD DRAWINGS
LRS, BRS, FIRE NOC
BUILDING PLANS, CONSTRUCTIONS & INTERIOR DESIGN
Ph: 040-24141785, Cell: 9966405785
Email : citytimestd@gmail.com

# ఒమన్ రాయబారితో ఏ.పీ. జితేందర్ రెడ్డి భేటీ..

## తెలంగాణలో పెట్టుబడులు, ఉపాధి, క్రీడా సహకారంపై కీలక చర్చలు.



న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (మాజీ ఎంపీ) ఏ.పీ. జితేందర్ రెడ్డి న్యూఢిల్లీలో ఒమన్ రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీతో ఇవాళ భేటీ అయ్యారు. న్యూఢిల్లీలోని ఒమన్ రాయబార కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం.. తెలంగాణ, ఒమన్ మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కించే దిశగా సాగింది.

ఈ భేటీ ముఖ్యంశాలు:

తెలంగాణలోని పెట్టుబడి అనుకూలమైన విధానాలను జితేందర్ రెడ్డి వివరించారు. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఒమన్ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను రాయబారి దృష్టికి తీసుకెళ్లారు.

తెలంగాణ నుంచి గ్రానైట్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులను ఒమన్‌కు ఎగుమతి చేయడంపై సానుకూల చర్చలు జరిగాయి.

తెలంగాణ, ఒమన్ మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంచేందుకు.. తెలంగాణ, ఒమన్ జట్ల మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించాలని.. ఏ.పీ.జితేందర్ రెడ్డి ప్రతిపాదించారు. దీనికి రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీ సానుకూలంగా స్పందించారు.

ఒమన్‌లో నివసిస్తున్న తెలంగాణ వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేకంగా చర్చించారు.

తెలంగాణ పారిశ్రామిక వృద్ధిని అభినందించిన ఇస్సా సలేహ్ అల్ షిబానీ.. త్వరలోనే ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలతో తదుపరి చర్చలు జరుపుతామని చెప్పారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. ఒమన్ వంటి దేశాలతో దీర్ఘకాలిక భాగస్వామ్యం ఏర్పడటం వల్ల.. ఇరుపక్షాలకు ఆర్థికంగా, సాంస్కృతికగా గొప్ప ప్రయోజనం చేకూరుతుంది'' అని వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ వద్ద బీజేపీ ప్రొటెక్షన్

కరీంనగర్/చొప్పదండి, ఫిబ్రవరి 5 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాడిద గుడ్డు తప్ప అణా పైసా ఇవ్వలేదని, 2014లో పోలవరం ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పిస్తామని ప్రధాని మోదీ మాట ఇచ్చి తప్పారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతిబాట సభలో ప్రసంగించారు.

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, ఇప్పటివరకు విచారణకు ఆదేశించలేదని, బీజేపీ, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధమని అన్నారు. దమ్ముంటే మున్సిపల్ ఎన్నికల్లోపు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను కాళేశ్వరం కేసులో అరెస్టు చేయాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ వద్ద బీజే పీ ప్రొటెక్షన్ మనీ తీసుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ ఎస్ నిలువెల్లా దోచుకున్నారని, రైతు లు, మహిళలు, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ప్రజలు చీ కొట్టిన తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కోసం పనిచేశారని విమర్శించారు. బీఆర్ఎస్ 'అవయవదానం' చేసి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించారని అన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేసింది కూడా ఏమీ లేదని, మున్సిపల్ ఎన్నికలు రాగానే.. లావు మొనగాడు లడాయికి పోతే, ముగ్గురు మొనగాళ్లు ఎనుకనుంచి నూకినట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడిని తీసుకువచ్చి ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చాం.. తెలంగాణ ప్రజలకు మనకు ఓట్లు వేయరని.. ఆ నాయకునికైనా తెలియాలి కదా' అని అన్నా రు. ప్రధాని మోదీ సహా ఢిల్లీలోని నా యకులందరినీ తెలంగాణకు తెచ్చినా బీజేపీ



ఒక్క మున్సిపాలిటినైనా గెలుచుకోలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ఏటీఎంగా మార్చు కున్నారని గతంలో బీఆర్ఎస్‌పై మోదీ, అమిత్ షా అన్న మాటలు గుర్తులేవా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

ఇక్కడి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేసీఆర్, కేటీఆర్‌లకు లెక్కలు చెప్తే గుండె పగిలి చస్తారని ధ్వజమెత్తారు. ఈ రెండు పార్టీలకు చీకటి ఒప్పందం ఉందన్నారు. పదేళ్లలో రాష్ట్రానికి బీఆర్ఎస్, పన్నెండేళ్లలో బీజేపీ దేశానికి చేసినదానికంటే తాము రెండేళ్లలో ఎక్కువ చేశామని అన్నారు. 70 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో ఎవరికైనా అను మానం ఉంటే ఎల్బీ స్టేడియానికి రావాలని అక్కడ వివరంగా చెప్తానని సవాల్ విసిరారు.

'ప్రజలకు సన్నబియ్యం ఇస్తున్నాం, విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలు పెంచాం, బ్రేక్ ఫాస్ట్ స్కీం తీసుకువచ్చాం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, రైతులకు ఉచిత కరెంట్ ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే'నన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, అధికారంలో ఉన్నప్పుడు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారని అన్నారు.

వారి పాలనలో భార్యాభర్తలు మాట్లాడుకునే ఫోన్లు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సినిమా స్టార్లు ఇలా అందరి ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. అలాం టి మనుషులకు మున్సిపల్ ఎన్నికల్లో ఓటేస్తే మన కళ్లను మన వేలితో పొడుచుకున్నట్లు అవుతుందని సీఎం అన్నారు.

గోదావరి పరివాహక దేవాలయాను అభివృద్ధిచేస్తాం..

2027లో గోదావరి పుష్కరాలు రాబోతున్నాయని, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకోసం ఎన్నివేల కోట్లయినా ఖర్చు చేస్తామని తెలిపారు. మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు రాలేదని, పేదోళ్ల దేవుళ్లను మొక్కేందుకు వా ళ్లకు నామోషీ అన్నారు. బీఆర్ఎస్ ఎన్ని శాపనార్థాలు పెట్టినా మరో ఎనిమిదేళు అధికారం మాదేనని, తెలంగాణను రాష్ట్రంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

అభ్యర్థులతో సమావేశమైన సీఎం..

కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతో గెలుస్తామని, ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుందని సూచించారు.



## చెన్నూరు మున్సిపాలిటీలో కుల సంఘాల నేతలతో సమావేశం- మంత్రి వివేక్ వెంకటస్వామి

మెట్రో సిటీ టైమ్స్ చెన్నూర్ ఫిబ్రవరి 5

ఈనెల 11వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో కార్మిక మరియు మైనింగ్ శాఖ మంత్రివర్యులు డా. వివేక్ వెంకటస్వామి కుల సంఘాల నేతలతో గురువారం నాడు సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని గౌడ కుల సంఘాల నాయకులతో ప్రత్యేకంగా భేటీ అయి, రానున్న మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా 16వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, పార్టీని బలపరుస్తున్న అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు అలాగే, చెన్నూరు మున్సిపాలిటీలోని గౌడ కుల సంఘ భవన నిర్మాణానికి రూ.25 లక్షల నిధులతో మంజూరైన భవనానికి సంబంధించిన అధికారిక పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి గారు సంఘ నాయకులకు అందజేశారు. ఈ నిధులు కుల సంఘాల అభివృద్ధికి, సామాజిక కార్యక్రమాలకు దోహదపడతాయని మంత్రి తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రజలందరినీ గుండెల్లో పెట్టి చూసుకుంటా

### -56వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి నల్ల శంకర్

### -ఎమ్మెల్యే సాగర్ రావు సహకారంతో అభివృద్ధి

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

హమాలివాడ 56వ డివిజన్లోని ప్రజలందరినీ తన గుండెల్లో పెట్టి చూసుకుంటానని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అభ్యర్థి నల్ల శంకర్ అన్నారు. గురువారం ప్రచారంలో భాగంగా తనకు మద్దతుగా వచ్చిన మహిళలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లోని అన్ని వర్గాల సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, యువతకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సాకారంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కృషి చేస్తానని తెలిపారు. హమాలివాడ కట్ట పోచమ్మ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని అన్నారు. ప్రతి ఒక్క ఓటరు తన గెలుపులో కీలకం కావాలని, ఎన్నిక మీదే అన్నట్లు ప్రచారం చేయాలని కోరారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పిఎస్ఆర్ వళ్ళనే అభివృద్ధి జరుగుతుందని, ప్రతిపక్ష అసత్య ప్రచారాన్ని ప్రజల నమ్మవద్దని కోరారు. మహిళలు కార్యకర్తలు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ గెలుపు వల్లనే అభివృద్ధి సాధ్యం

## ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోకండి

### 14వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి తుముల నరేష్

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్వారానే వార్డు ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని, సంక్షేమ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుముల నరేష్ కోరారు. గురువారం వార్డులోని ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారు. మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అభ్యున్నతికి తాను చేస్తున్న సేవలను గుర్తించాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా స్వాగత తోరణం



కట్టించడమే కాకుండా పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు సహకారంతో అనేక పనులు చేసినట్లు తెలిపారు.

తనను గెలిపిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తానని అన్నారు. టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు ఓట్లు వేయడం వల్ల మోసపోక తప్పదని తెలిపారు. మహిళలు యువతీ యువకులు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని అన్నారు. డివిజన్లోని పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఈరోజు మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్ల్స్ హై స్కూల్‌లోని 59,60 డివిజన్ల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్‌తో కలిసి ప్రత్యక్షంగా సందర్శించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడి పరిసరాలను సమీక్షించి,శాంతి భద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను గుర్తించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని కూడా సూచించారుప్రజలు భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం కల్పించడానికి, పోలింగ్ రోజు ఎలాంటి అక్రమాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీస్ తరపున అన్ని భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, చట్టవిరుద్ధ చర్యలు ఎవరు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్‌గారు తెలిపారు.స్థానిక ప్రజలకు,అన్ని పార్టీల కార్యకర్తలకు శాంతి భద్రతలు, చట్టపరమైన నిబంధనలు,ప్రవర్తనా నియమావళిని పాటించాలని కోరారు .ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మంచిర్యాల ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు





## గాజుల ముఖేష్ ప్రచారానికి జనం నీరాజనాలు

### 57వ డివిజన్లో మహిళల యువకుల ప్రచారం

### ప్రజా సేవకు కట్టుబడి ఉంటానని ఓటర్లకు భరోసా



మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

మంచిర్యాల టూ టౌన్ ఏరియా హమాలివాడ 57వ డివిజన్లో బిజెపి పార్టీ అభ్యర్థి గాజుల ముఖేష్ గౌడ్ చేపట్టిన ప్రచారానికి ఆ ప్రాంత ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ గా మంచాల అభివృద్ధికి చేసిన కృషిని ప్రజలు గుర్తించాలని కోరారు. అదే స్ఫూర్తితో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి ఒక్కరూ తనకు అత్యంత ఆత్మీయులు అని, వారి సహకారంతో వార్డు అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. గతంలో పనిచేసిన వారి వల్ల వార్డులో జరిగిన అభివృద్ధి శూన్యమని, దీనిని గ్రహించి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. హిందుత్వ ఎజెండా తమలక్ష్యమని, కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా చూస్తామని తెలిపారు. బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డివిజన్ లోని ఇతర పార్టీల నాయకులు కూడా ఆయనకు అండగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

మెట్రో సిటీటైమ్స్

శుక్రవారం, ఫిబ్రవరి 6, 2026

## అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది. భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి. అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది. అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. అయితే, మూడీస్ విశ్లేషణ ప్రకారం, భారత్ ఈ మార్పును నెమ్మదిగా అమలు చేస్తుంది, ఎందుకంటే తక్షణ మార్పు భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఒప్పందం ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్ వంటి రంగాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ఎందుకంటే అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది. భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది. అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిట్ కూడా టాప్ -5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో ఈ కూటమి వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉన్నట్టు లెక్కలు చూస్తున్నాయి. ఇవే కాకుండా, భారత్ ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, సార్క్ దేశాలు, మారిషస్, యూఏఈ , ఆస్ట్రేలియా వంటి దేశాలతో ప్రాంతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కలిగి ఉంది. తాజా ఒప్పందాలతో భారత తయారీ రంగం సేవా రంగానికి అంతర్జాతీయ మార్కెట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి. భారత్ తన వాణిజ్య విధానాల్లో చూపిస్తున్న ఈ దూకుడు ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చైనా వంటి దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న పాశ్చాత్య దేశాలకు భారత్ ఇప్పుడు ఒక నమ్మకమైన, బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. సుంకాల తగ్గింపు వ్యూహాత్మక భాగస్వామ్యాలు, స్థిరమైన ఆర్థిక వృద్ధి భారత్‌ను త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదని నిపుణులు అంటున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి రెబల్ అభ్యర్థి

### నల్ల శంకర్ గెలుపు కోసం మద్దతు



మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

మంచిర్యాల టూ టౌన్ ఏరియా 57వ డివిజన్ బిజెపి పార్టీ రెబల్ అడువాల సురేష్ అభ్యర్థి ఎమ్మెల్యే ప్రేమ సాగరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తమ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి నల్ల శంకర్ కు మద్దతు ప్రకటిస్తూ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే పి ఎస్ ఆర్ అన్నారు. అన్ని పార్టీల నాయకులు తనకు మద్దతు ఇస్తుండడం సంతోషంగా ఉందని, వారి సహకారంతో వార్డు ప్రజల అభ్యున్నతికి సేవలో అందిస్తానని నల్ల శంకర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పానుగంటి శ్రీనివాస్, తోట తిరుపతి, అన్వేష్, సాయి సతీష్ ఉన్నారు.

## పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ. లకు నిర్వహించిన శిక్షణహోకార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్‌హోగోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిశాక తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, ఇతర ఇబ్బందులు తలెత్తితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా



నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, మంచిర్యాల నగర పాలక సంస్థ జూనియర్ అకౌంట్ ఆఫీసర్ సిహెచ్. అనితాదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



## సత్తమ్మ... నీకే మా దీవెనలు అమ్మ

### 55వ డివిజన్లో గాండ్ల సత్తమ్మ గెలుపుకు జోరుగా ప్రచారం

### బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

మంచిర్యాల టూ టౌన్ ఏరియా 55వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గాండ్ల సత్తమ్మ ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

గురువారం నిర్వహించిన ప్రచారంలో మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కౌన్సిలర్ గా సత్తెమ్మ చేసిన సేవలను గుర్తించి మరోసారి కార్పొరేటర్ గా ఆమెను ఆదరిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు చేస్తున్న అభివృద్ధిని గుర్తించి వార్డు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తామని ప్రజలు పేర్కొంటున్నారు. టూ టౌన్ ఏరియాలో విశాలమైన రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు, పట్టణ అభివృద్ధి పట్ల ప్రజలు చైతన్యం అవుతూ గాండ్ల సత్తెమ్మ గెలుపుకు కృషి చేస్తామని ప్రచారం చేస్తున్నారు. ప్రజాసేవ లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు సాగరంతో పోటీ చేస్తున్న తన తల్లి సత్యమ్మను ఓటర్లు ఆదరించాలని కుమారుడు శేఖర్ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నారు. గడపగడప ప్రచారంలో పెద్ద సంఖ్యలో ప్రజలు ఓటర్లు పాల్గొన్నారు.

## 14వ వార్డులో ఇంటింటి ప్రచారం...

రామకృష్ణాపూర్ మెట్రో సిటీ టైమ్స్ ఫిబ్రవరి 5 :

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగుల రాజ్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం వార్డులోని పోచమ్మబస్తీ, మల్లిఖార్జున్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగుల రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ మున్సిపల్ ఎన్నిలలో నన్ను ఆశీర్వదించి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మన వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కార్మిక శాఖ మంత్రి వివేక్ వల్ల చెన్నూర్ నియోజక వర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మేజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను



గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చేసిన సేవల గుర్తించి నన్ను గెలిపించండి

### 59వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి మాదంశెట్టి సత్యనారాయణ

### వార్డుల్లో ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 4

డివిజన్ అభివృద్ధికి ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి తనను గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి మాదంశెట్టి సత్యనారాయణ అన్నారు. గురువారం నాడు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర రావు కాంగ్రెస్ పార్టీ తరపున 59 వ వార్డు కార్పొరేటర్ గా నియమించారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ నెంబర్ వన్ స్థానంలో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అలాగే 59 వార్డులో ఎటువంటి సమస్యలు ఉన్న వాటికి కృషి చేస్తానని అన్నారు ఇప్పటికీ నాలుగు సార్లు కౌన్సిలర్ గా ఎన్నుకోవడం జరిగిందని నేను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీ ఈసారి కార్పొరేటర్ గా ఎన్నుకుంటారని అన్నారు ప్రజా సంక్షేమ అభివృద్ధికి సేవలు అందిస్తానని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని తెలిపారు. యువత మార్పును కోరుకొని కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. డివిజన్ లోని మహిళలు యువకులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ ప్రచారంలో మంచిర్యాల వైశ్య సంఘం అధ్యక్షుడు కటకం హరీష్ చందూరి పురుషోత్తం దంతుల ముఖేష్ కేశెట్టి వంశీకృష్ణ మోటూరి అశోక్ పడకండి శ్రీనివాస్ మంచిర్యాల పట్టణంలోని వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు

## మంచితనాన్ని గుర్తించి గెలిపించండి

### 14 వ డివిజన్ బిఆర్ఎస్ అభ్యర్థి వోద్నాల రవీందర్

### ఇంటింటికి విస్తృత ప్రచారం

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

తన మంచితనాన్ని, మర్యాదను గుర్తించి ప్రజా సేవ చేయాలని సంకల్పంతో పోటీ చేస్తున్న తనను కార్పొరేటర్ గా 14వ డివిజన్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వద్నాల రవీందర్ కోరారు. గురువారం పాత మంచిర్యాల డివిజన్లోని ఇంటికి ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం



పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు చేసిన అభివృద్ధిని, ప్రజాసేవను గుర్తించి ప్రజలు 19 గెలిపించాలని కోరారు. డివిజన్లోని మహిళలకు సంక్షేమం, యువతకు స్వయం ఉపాధి చూపించి వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తానని అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సమర్థ పాలనకు ఎన్నికలు గురుపాటం కావాలని అన్నారు. పాత మంచిర్యాలలో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారమే ధ్యేయంగా ప్రజాసేవ చేస్తానని అన్నారు. ఆయనకు మద్దతుగా పార్టీ ముఖ్య నాయకులు నడిపెల్లి విజిత్ రావ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు పెంట నవీన్, రమేష్ యాదవ్, అమ్రోస్, నార్ల వంశీ, కోల బాలచందర్ గౌడ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులని గెలిపించండి

### డిసిసి మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ


### 47 వ డివిజన్ అభ్యర్థి బొల్లం భీమయ్య

### గెలుపు కోసం ప్రచారం

### తరలివచ్చిన మహిళలు యువకులు

మెట్రో సిటీ టైమ్స్ మంచిర్యాల ఫిబ్రవరి 5

ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు మంచిర్యాలలో చేస్తున్న అభివృద్ధిని చూసి కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డిసిసి మాజీ అధ్యక్షురాలు కొక్కెరల సురేఖ కోరారు. గురువారం 47 వ డివిజన్ బొల్లం భీమయ్య ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సేవ చేయాలని సంకల్పంతో భీమయ్య తో పార్టీ అభ్యర్థిగా ఉన్నాడని, అతనికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బొల్లం భీమయ్య మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని సమస్యలను పరిష్కరించి ఎమ్మెల్యే పి ఎస్ ఆర్ సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమం లక్ష్యంగా ప్రజాసేవ చేస్తానని స్పష్టం చేశారు. రోడ్లు డ్రైనేజీ కోసం ఎమ్మెల్యే ద్వారా పనులు పూర్తిచేస్తామని అన్నారు. వార్డులోని అన్ని ప్రాంతాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి బ్రహ్మరథం పట్టారు. గెలుపు తథ్యమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణలో భారీగా టైఫాయిడ్ మరణాలు




హైదరాబాద్ : టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. 2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది. మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది. అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు. నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్ కంటిన్యూ



హైదరాబాద్ : తెలంగాణలో 12 ఏళ్లుగా డైవర్షన్ పాలిటిక్స్ కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్.. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదటి నాలుగున్నరేళ్లు టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకున్న కేసీఆర్ ప్రతిపక్షం లేకుండా చేయాలనుకున్నారు. ఇక 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లి డైవర్షన్ పాలిటిక్స్‌కు కొత్త అర్థం చెప్పారు. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లి.. మరోమారు అధికారంలోకి వచ్చారు. తమ ప్రభుత్వం విమర్శలు లేదా ఆరోపణలు పెరిగినప్పుడు కేంద్ర బీజేపీపై దాడి చేయడం, బండి సంజయ్ వంటి నాయకులపై ప్రెస్‌మీట్లు నిర్వహించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేసేవారు. ఇది క్లాసిక్ డైవర్షన్ టాక్టిక్‌గా మారింది. సొంత సమస్యల నుంచి దూరం చేయడానికి విమర్శకులపై ప్రతిదాడి చేసేవారు. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్ రాజ్ నడుస్తోంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇప్పుడు రేవంత్ కూడా కేసీఆర్‌ను మించిన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదనిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తన వ్యూహాన్ని మరింత షార్ప్‌గా అమలు చేస్తున్నారు. మూసీ శుద్ధీకరణ ప్రాజెక్ట్‌పై హైదరాబాద్ ప్రజల్లో రేవంత్ సర్కార్‌పై వ్యతిరేకత వచ్చింది. మూసీ ఆక్రమణల కూల్చివేతతో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీనిని ప్రతిపక్ష బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మలచుకోవాలని భావించింది. దీంతో రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈ రేసు కేసులో నోటీసులు జారీ చేశారు. హైడ్రా కూల్చివేతలపై మొదట్లో హైదరాబాద్ వాసుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ తర్వాత పెద్దల ఇళ్లు కూల్చకుండా పేదలవి కూల్చడంపై వ్యతిరేకత వచ్చింది. దీని నుంచి దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి ఫీచర్ సిటీని తెరపైకి తెచ్చారు. హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ఈమేరకు భూముల్లోని చెట్లను బుల్డోజర్లతో తొలగించడం రాష్ట్రవ్యాపంగా రచ్చకు తెరలేపింది. అడవిని తొలగిస్తున్నారని, వన్యప్రాణులను చంపేస్తున్నారని మీడియాలో పెద్ద ఎత్తుక కథనాలు వచ్చాయి. పర్యావరణ ప్రేమికులు కోర్టును ఆశ్రయించారు. దీంతో యథాతథ స్థితి కొనసాగించాలని న్యాయస్థానాలు స్టే విధించాయి. దీనిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఈ సమయంలోనూ రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టి మళ్లించేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ అంశాన్ని తెరపైకి తెచ్చారు. తాజాగా, నైనా బొగ్గు టెండర్‌లో భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య ఆధిపత్య పోరు బయటపడింది. టెండర్ కోసం ఇద్దరు మంత్రులు పోటీ పడడం, భట్టికి చెందిన సంస్థకు అప్పగించే ప్రయత్నాలు జరగడం సంచలనమైంది. ఇదే సమయంలో కోమటిరెడ్డికి, ఓ ఐఏఎస్‌కు లింకు అంటగట్టడం, ఐఏఎస్‌లు అంతా ఒక్కటై కేసు పెట్టడం రేవంత్ సర్కార్‌కు మచ్చగా మారింది. దీంతో రేవంత్‌రెడ్డి మరోమారు డైవర్షన్ పాలిటిక్క్‌కు తెరతీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చి మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్, సంతోష్ రావులకు నోటీసులు ఇచ్చారు. విచారణ చేయించారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయంలో, కాంగ్రెస్ మెజారిటీ మున్సిపాలిటీలను కౌవసం చేసుకుని బలంగా కనిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి భాగంగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ డ్రామాను సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను అణచివేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. లోపాలు బయట పడిన సమయంలో విపక్ష నాయకులపై కేసులు పెట్టడం వల్ల ప్రజలు ప్రభుత్వ విఫలాలను మరచిపోతారు. ఇది కేవలం రాజకీయ డైవర్షన్ కాదు, విచారణల ద్వారా ఎదుగుదలను కూడా సృష్టిస్తుంది. ఈ వ్యూహం కొంతమేర పని చేసినా, ప్రజలు దీర్ఘకాలిక సమస్యలు (మూసీ, టెండర్లు) మరచిపోరేలా లేదు. కేసీఆర్ తన హయాంలో చేసినట్లే రేవంత్ కూడా ఇదే మార్గం తీసుకుంటుంటే, ఎన్నికల్లో కాంగ్రెస్ బలం నిజమేనా అనేది పరీక్షించాలి. డైవర్షన్ పాలిటిక్స్ రాజకీయాల్లో సాధారణం కాబట్టి, దీర్ఘకాలంలో పాలసీలు, అభివృద్ధి చూపితేనే నిజమైన విజయం వస్తుంది.

# నిబంధనలు పాటించాల్సిందే..

## - వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రఖ్యాత సోషల్ మీడియా కంపెనీలు వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని వాట్సాప్, మెటాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పేద మహిళ, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యక్తి, ఎవరైనా తమిళం మాత్రమే మాట్లాడే వ్యక్తి లాంటి వాళ్లకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని సోషల్ మీడియా కంపెనీలను సుప్రీంకోర్టు బెంచ్ నిలదీసింది. కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారని ధర్మాసనం పేర్కొంది. 2024 నవంబరు 18న వాట్సాప్ నిర్వాహక కంపెనీ మెటాపై రూ.213.14 కోట్ల జరిమానాను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించింది. వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే ప్రక్రియపైనా ఐదేళ్ల నిషేధాన్ని విధించింది. “వాడితే వాడండి, లేదంటే వదిలేయండి” అన్నట్టుగా వాట్సాప్ ప్రైవసీ పాలసీ ఉందని సీసీఐ వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాట్సాప్, మెటా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశాయి. మంగళవారం వీటిపై విచారణ నిర్వహించే క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది. భారత ప్రభుత్వ సంస్థ సీసీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాట్సాప్, మెటా కంపెనీల తరపు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. నిలిపివేయండి (ఆప్ట్ ఔట్) అనే ప్రస్తావన తమ ప్రైవసీ పాలసీలో ఉందని, అలాంటప్పుడు యూజర్ల సమాచారాన్ని తాము వాణిజ్య ప్రకటనల సంస్థలకు బదిలీ చేయడంపై అభ్యంతరం ఎందుకని వాట్సాప్ తరపు న్యాయవాదులు వాదించారు. ఆప్ట్ ఔట్ లాంటి ఆప్షన్ల గురించి తమలాంటి వాళ్లకే సరిగ్గా తెలియదని, ఎక్కడో బిహార్‌లోని మారుమూల పల్లెల్లో ఉండే భారతీయులకు ఎలా తెలుస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ప్రైవసీ పాలసీ మాటున భారతీయ వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారని మండిపడింది. ఇలా జరగకుండా అడ్డుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తన వ్యక్తిగత అనుభవం ఒకటి చెప్పారు. “కొంతమంది వాట్సాప్ యూజర్లు, డాక్టర్లతో వాట్సాప్‌లో ప్రైవేట్ ఛాటింగ్ చేశారట. ఆ వెంటనే వాళ్లకు మెడిసిన్స్‌కు సంబంధించియాడ్స్ కనిపించడం మొదలైందట. ఈ లెక్కన యూజర్ల సమాచారాన్ని, ఆసక్తులను కూడా డబ్బుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు” అని సీజేఐ పేర్కొన్నారు. వాట్సాప్ తరపు న్యాయవాదులు స్పందిస్తూ, అన్ని వాట్సాప్ మెసేజ్‌లు ఎండ్ టుఎండ్ ఎన్‌క్రిప్టెడ్‌గా ఉంటాయన్నారు. స్వయంగా వాట్సాప్ కంపెనీ కూడా వాటిని చూడలేదని స్పష్టం చేశారు. సీసీఐ తరపు న్యాయవాది తుషార్ మెహతా జోక్యం చేసుకుంటూ, యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే విషయంలో వాట్సాప్, మెటాలు దోపిడీదారు వైఖరితో అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. యూజర్ల నుంచి నిర్దిష్ట అనుమతిని పొందకుండానే వారి వ్యక్తిగత యాక్టివిటీలు, ఆసక్తుల సమాచారాన్ని సోషల్ మీడియా కంపెనీలు అమ్ముకోకుండా నిరోధించాలని తుషార్ మెహతా కోరారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ప్రకారం సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రత కోసం నిర్దిష్ట మార్గదర్శకాలను ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు. తుషార్ మెహతా వాదనతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఏకీభవిస్తూ రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని వాట్సాప్, మెటాలను హెచ్చరించారు. ఈ లిటిగేషన్‌లో భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా ఒక పక్షంగా చేరుస్తున్నట్లు వెల్లడించారు.

సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రతపై తగిన సూచనలను తమకు సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను సీజేఐ ఆదేశించారు. ఈ అంశంపై వాదనలు ముగిసే వరకు యూజర్లకు సంబంధించిన ఏ సమాచారాన్నీ మెటా కంపెనీకి ఇవ్వొద్దని వాట్సాప్‌కు సుప్రీంకోర్టు బెంచ్ ఆర్డర్ ఇచ్చింది. సోషల్ మీడియా కంపెనీల వాణిజ్య వ్యవహారాల వల్ల భారత పౌరుల ప్రాథమిక గోప్యతా హక్కుకు భంగం కలగరాదని తేల్చి చెప్పింది. డేటా షేరింగ్ పేరుతో భారత పౌరుల ప్రైవసీ హక్కుతో ఆటలు ఆడటం సరికాదని పేర్కొంది. అన్యాయంగా వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని ఇతరులకు షేర్ చేసేందుకు టెక్ కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. టెక్ దిగ్గజ కంపెనీల ప్రైవసీ షరతులు, నిబంధనలకు చాలా తెలివిగా రూపకల్పన చేశారని మండిపడింది. ఈ అంశంపై మళ్లీ ఫిబ్రవరి 9న వాదనలు వింటామని, ఆ రోజునే మధ్యంతర ఆదేశాలను జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

# మోహన్ బాబు, మంచు విష్ణును అరెస్టు చేయాలి

ఆత్మకూర్ : విద్యార్థి సంఘ నేతలను కిడ్నాప్ చేసిన మోహన్ బాబు యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కేజీ రోడ్డుపై మోహన్ బాబు, విష్ణు ల చిత్రపటాలను చెప్పుతో కొడుతూ, దహనం చేసి ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కే దినేష్ కుమార్ ఆత్మకూరు మండల అధ్యక్షులు కే సాయి నిరసన తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలు, ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ శాంతియుత ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘ నేతలను యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు అడ్డుకుని, కొట్టి, కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కిడ్నాప్కు పాల్పడిన మోహన్ బాబు యూనివర్సిటీపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుండి రూ.26 కోట్లు అధికంగా ఫీజులు వసూలు చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా కమిషన్ స్పష్టం చేస్తూ, యూనివర్సిటీ అక్రమంగా వసూలు చేసిన రూ.26 కోట్లు వెంటనే విద్యార్థులకు చెల్లించాలని ఆదేశించింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేయడంపై యూనివర్సిటీకి రూ.16 లక్షలు జరిమానా విధించింది అని వారన్నారు .అయినప్పటికీ మోహన్ బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీ ఆగలేదు. దీంతో ఎస్ ఎఫ్ ఐ, పలు విద్యార్థి సంఘాలు ఈరోజు తిరుపతి కలెక్టరేట్ వద్ద శాంతియుత ఆందోళనకు పిలుపునిచ్చాయి. కలెక్టరేట్ కు కూతవేటు దూరంలో మోహన్ బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు, గూండాలు దాదాపు 40 మంది కార్లలో వచ్చి, ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్బర్, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ ను నిర్బంధించి, వారి ద్విచక్ర వాహనాన్ని పడదోసి, వాళ్లని కొట్టి, కారులో బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్ చేయడం దుర్మార్గమని వారు అన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు తిట్టుకుంటుంటే, ప్రైవేట్ శక్తులు చట్టాన్ని అతిక్రమిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయి. దౌర్జన్యాలు, బెదిరింపులు, కిడ్నాప్లతో బెంబేలెత్తిస్తున్నాయి. చట్టాలను అతిక్రమిస్తున్నాయి. రాష్ట్ర విద్యాశాఖామంత్రి శ్రీ నారా లోకేష్ విద్యా వ్యవస్థలో, ప్రైవేటు యూనివర్సిటీలలో లోపాలను, అక్రమాలను ఏమాత్రం పట్టించుకోకుండా, రెడ్ బుక్ ను వెంటబెట్టుకుని తిరుగుతున్నట్లుగా ఉంది. మోహన్ బాబు యూనివర్సిటీ అక్రమాలపై గతంలో శ్రీ నారా లోకేష్ తెలియజేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇప్పటికైనా ఎస్ఎఫ్ఐ విద్యార్థులను కిడ్నాప్ చేసినటువంటి మోహన్ బాబును మంచు విష్ణు లను వారు అనుచరులను వెంటనే అరెస్టు చేసి మోహన్ బాబు యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్ నరసింహ నాయక్ మౌలాలి మహి మణి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# విచారణ మధ్య నుంచే వెళ్లిపోయిన అరవ శ్రీధర్

కడప : రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్.. జనసేన విచారణ కమిటీ ముందు హాజరయ్యారు. అరవ శ్రీధర్ మీద మహిళ ఆరోపణల నేపథ్యంలో జనసేన పార్టీ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ముందు హాజరైన అరవ శ్రీధర్.. తన వివరణ తెలియజేశారు. అయితే సమావేశం మధ్యలోనే అరవ శ్రీధర్ బయటకు వచ్చినట్లు తెలిసింది. తన వివరణ, వివరాలు అన్నీ అందించానని.. పార్టీ అన్నీ చూసుకుంటుందంటూ అరవ శ్రీధర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విచారణ కమిటీ ముందు హాజరయ్యారు. అరవ శ్రీధర్ మీద ఓ మహిళ లైంగిక ఆరోపణలు చేసిన నేపథ్యంలో జనసేన పార్టీ ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంపై విచారణ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా అరవ శ్రీధర్‌ను జనసేన అధిష్టానం ఆదేశించింది. వారం రోజులు గడువు ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే అరవ శ్రీధర్ జనసేన విచారణ కమిటీ ముందు హాజరయ్యారు. అయితే సమావేశం మధ్యలోనే ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బయటకు వచ్చేసినట్లు తెలిసింది. బయట విలేకర్లతో మాట్లాడుతూ.. తన వివరణ మొత్తం అధిష్టానానికి చెప్పినట్లు అరవ శ్రీధర్ తెలిపారు. అన్ని వివరాలు సమర్పించానని.. పార్టీ నిర్ణయం తీసుకుంటుందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు జనసేన పార్టీ జనరల్ బాడీ మీటింగ్‌లోనూ అరవ శ్రీధర్ వ్యవహారం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ విషయం మీద డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సీరియస్ అయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విచారణ కమిటీ ముందు హాజరై తన వివరణ తెలియజేశారు. ఈ వివరణ ఆధారంగా అరవ శ్రీధర్ విషయంలో జనసేన పార్టీ చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అరవ శ్రీధర్ మీద ఆరోపణలు చేసిన బాధితురాలు మరో వీడియో విడుదల చేశారు. ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దంటూ ఈ వీడియోలో బాధితురాలు కోరారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతిష్టకు భంగం కలిగించవద్దంటూ కోరారు. పవన్ కళ్యాణ్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని.. ఈ విషయంలో ఆయనకు ప్రమేయం లేదన్నారు. ఇదే సమయంలో అరవ శ్రీధర్ మీద మరికొన్ని ఆరోపణలు చేశారు. అధికారం, డబ్బుతో తనను లోబరుచుకోవాలని చూస్తున్నారని.. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే.. అరవ శ్రీధర్, తన ఫోన్లలోని డేటాను పరిశీలిస్తే నిజానిజాలు తెలుస్తాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అరవ శ్రీధర్ మద్దతుదారులు మాత్రం దీని వెనుక కుట్ర కోణం ఉందని ఆరోపిస్తున్నారు. ఆ మహిళ ఏదో ఆశించి అరవ శ్రీధర్ మీద ఆరోపణలు చేస్తున్నారని మండిపడుతున్నారు. అరవ శ్రీధర్‌ను రాజకీయంగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

# చిరంజీవితో కొండా సురేఖ భేటీ

హైదరాబాద్ : మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కలిశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న చిరు ఇంటికి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. తన వెంట తీసుకువచ్చిన ఆంజనేయుడి చిత్ర పటాన్ని ఆయనకు బహూకరించారు. కొండా సురేఖ తన కుమార్తె సుస్మితతో కలిసి మెగాస్టార్ ఇంటికి వెళ్లడం గమనార్హం. అయితే ఆమె ఎందుకు చిరంజీవిని కలిశారు అనేది మాత్రం వెల్లడించలేదు. పైగా ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన మంత్రి కొండా సురేఖ.. కేంద్ర మాజీమంత్రి అంటూ మెగాస్టార్ చిరంజీవిని సంబోధించడం గమనార్హం. చిరంజీవిని కలిసిన కొండా సురేఖ .. ఆయనకు ఇష్టమైన ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందించారు. ఆ తర్వాత కొద్దిసేపు చిరంజీవితో భేటీ అయ్యారు. కొండా సురేఖ వెంట ఆమె కూతురు కొండు సుస్మిత కూడా ఉన్నారు. చిరంజీవితో భేటీ అయిన వీడియో, ఫోటోలను మంత్రి తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక అదే పోస్ట్‌లో చిరంజీవిని ఆమె మాజీ కేంద్రమంత్రి అంటూ పేర్కొనడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన చిరంజీవి.. ఆ తర్వాత తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి.. రాజ్యసభకు ఎన్నికై కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్న చిరంజీవి.. తాను ఇక నుంచి రాజకీయాల్లోకి తిరిగి వచ్చే ప్రసక్తి లేనేలేదని ఇప్పటికే గతంలో పలుమార్లు క్లారిటీ కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కొండా సురేఖ.. చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిసి భేటీ కావడం వెనుక ఏదైనా కారణం ఉందా అనే అనుమానాలు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే చిరంజీవి మాత్రం రాజకీయాల్లోకి రారని సంబంధిత వర్గాలు ఇప్పటికే కుండబద్ధలు కొట్టి చెప్పేశాయి. ఇక చిరంజీవిని కొండా సురేఖ కలిసిన ఫోటోలు, నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాల కారణాలు చెబుతున్నారు. ఇటీవలె రామ్ చరణ్-ఉపాసన దంపతులకు కవల పిల్లలు జన్మించిన సంగతి తెలిసిందే. అయితే దానికి సంబంధించి కొండా సురేఖ శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లారని పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు.. చిరంజీవికి కొండా సుస్మిత ఫ్యాన్ అని.. అందుకే ఆయనను కలిసేందుకు తనతల్లితో కలిసి వెళ్లారని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.

# అంబటి ఇంటిపై దాడి.. నిందితురాలిగా ఎమ్మెల్యే మాధవి

గుంటూరు : ఏపీ మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంబటి రాంబాబు కార్యాలయం, నివాసంపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు కీలక చర్యలు తీసుకున్నారు. గుంటూరులోని పట్టాభిపురం పోలీసులు ఈ ఘటనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం అధికార కూటమి వర్సెస్ ప్రతిపక్ష వైసీపీ నేతలుగా వివాదం ముదురుతోంది. ఈ కేసులో పోలీసులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిని ప్రధాన నిందితురాలిగా (ఏ1) చేర్చారు. అలాగే ఆమె భర్త గల్లా రామచంద్రరావును ఏ2 కాగా, మొత్తం 31 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అల్లర్లు సృష్టించడం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, అక్రమంగా చొరబాటు వంటి అభియోగాలను వీరిపై మోపారు. దాడి జరిగిన సమయంలో అంబటి రాంబాబు కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొనడం తెలిసిందే. అంబటి రాంబాబు చేసిన కొన్ని వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ శ్రేణులు మొదటి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. తరువాత ఈ దాడికి పాల్పడ్డారు. అంబటి రాంబాబు కార్యాలయం ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు అక్కడ ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను చింపివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసులు సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ డిమాండ్ చేస్తుండగా, తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గుంటూరులో రాజకీయాలను వేడెక్కిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు మొబైల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు తీర్పుతో ఆయన్ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అంతకుముందు గుంటూరు జీజీహెచ్‌లో అంబటికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో స్టేషన్ బెయిల్ లభించినప్పటికీ, సీఎంపై దూషణల కేసులో కోర్టు రిమాండ్‌కు ఆదేశించింది. పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో అంబటిపై రాష్ట్రవ్యాప్తంగా 16 క్రిమినల్ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన బయట ఉంటే శాంతిభద్రతల సమస్య తలెత్తడమే కాకుండా, ఆయన ప్రాణాలకు కూడా ముప్పు ఉందన్న పోలీసుల వాదనతో కోర్టు ఏకీభవించింది. సీఎంపై అసభ్య పదజాలం వాడారని, రెండు వర్గాల మధ్య వైషమ్యాలు పెంచేలా ఆయన తీరు ఉందని పోలీసులు కోర్టుకు విన్నవించారు. ఆరోపణలు రుజువైతే ఏడేళ్లపైగా శిక్ష పడే అవకాశం ఉండటంతో, తదుపరి విచారణ కోసం అంబటి రాంబాబును తమ కస్టడీకి ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోరారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES

శుక్రవారం, ఫిబ్రవరి 6, 2026

## కంటోన్మెంట్ బోర్డు విలీనం అంశంపై రేణుకా చౌదరితో భేటీ అయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

హైదరాబాద్ : కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బంజారా హిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డుకు 6 ఏళ్ళ నుంచి ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడాన్ని నిరసిస్తూ,జీహెచ్ఎంసి అభివృద్ధితో పోల్చుకుంటే 30 ఏళ్ళు వెనుకబడ్డ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కోసం నామినేటెడ్ వ్యవస్థను రద్దుచేసి బోర్డును వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ తాను చేసిన రిలే నిరహార దీక్షకు వచ్చిన స్పందనను తెలియజేసి బోర్డు విలీనానికి తమవంతు ప్రయత్నం చేయాలని రిప్రజెంటేషన్ అందజేశారు. కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శ్రీగణేష్ చేస్తున్న పోరాటానికి రేణుకా చౌదరి తన వంతు మద్దతు ఉంటుందని తెలిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాల్సిన ఆవశ్యకత గురించి రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ని ప్రత్యేకంగా కలిసి మాట్లాడుతానని చెప్పారు.

## పెళ్లి కావడం లేదని ఆత్మహత్య

హైదరాబాద్ : తల్లిపై ఉన్న ప్రేమ, బాధ్యత ఒకవైపు.. తన వివాహం కావడం లేదనే వేదన మరోవైపు.. ఆ యువతిని తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాయి. తల్లికున్న వైకల్యం కారణంగా తన వివాహం జరగడం లేదని భావించిన ఓ యువతి మనస్తాపానికి లోనై ప్రాణాలు తీసుకుంది. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన తోష్నివాల్ విజయలక్ష్మి అనే 26 ఏళ్ల యువతి ఒక ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తోంది. ఆమెకు చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. మరోవైపు మతిస్థిమితం లేని తల్లి సరస్వతి బాధ్యతలు విజయలక్ష్మి చూసుకునేది. వీరు కూకట్‌పల్లి పరిధిలోని మైత్రినగర్‌లో నివాసం ఉంటున్నారు.ఐటీ ఉద్యోగిని విజయలక్ష్మికి ఇటీవల పెళ్లి సంబంధాలు వచ్చాయి. అయితే, తన తల్లి పరిస్థితినిని వివరించడంతో పాటు, ఎవరూ ఆమెను చూసుకునేవారు లేరని, పెళ్లి తర్వాత కూడా తనతోనే ఉంటుందని పెళ్లి సంబంధాల సమయంలో చెప్పేది. అయితే, ఆమె తల్లి కూడా తమ వద్దే ఉండటానికి ఎవరూ ఒప్పుకోలేదు. దాంతో పెళ్లి సంబంధాలు రద్దు అవుతూ వస్తున్నాయి. తల్లి అనారోగ్యం కారణంగా తనకు పెళ్లి సంబంధాలు కుదరకపోవడం, తనకు వివాహం కావడం లేదని ఆమె మనోవేదనకు గురైంది. తల్లికి అన్నీ తానై సేవలు చేస్తున్నప్పటికీ, తన భవిష్యత్తు గురించి ఆలోచించి కుంగిపోయింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది, కానీ ఎంతకీ తిరిగి రాలేదు.విజయలక్ష్మి అదృశ్యంపై ఆమె బంధువు అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం హుసేన్‌సాగర్‌లో ఒక యువతి మృతదేహం తేలిందని లేక్ పోలీసులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆ మృతదేహం టెకీ విజయలక్ష్మిదేనని నిర్ధారించారు. తల్లి కోసం ఎంతో తపించిన యువతి చివరకు తల్లి అనారోగ్యమే తన పెళ్లికి అడ్డంకిగా మారిందని, తనతో పాటు ఆమె ఉండేందుకు ఎవరూ ఒప్పుకోవడం లేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా అందరినీ కలిచివేసింది.

## కోకోవా పంట పెంచడానికి చర్యలు

విశాఖపట్నం : కేంద్ర బడ్జెట్ 2026 పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ స్పందించారు.విశాఖలో మీడియాతో మాట్లాడుతూ అమెరికా తన దృష్టి కోణా న్ని మార్చుకోవడం శుభపరిణామమని, 18 శాతం టారిఫ్ తగ్గించడం ఆహ్వానించదగ్గ విషయమని తెలిపారు. కోకోవా పంటను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, ఉత్తరాంధ్ర ప్రాంతంలో అరుకు నుంచి పాడేరు వరకు రోడ్డు అభివృద్ధి చేసి సైక్లింగ్, మారథాన్ లకు అనుకూలంగా తీర్చిదిద్దుతామని, పులికాట్ సరస్సు అభివృద్ధి చేస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలి

### - ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల : సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) డెలివరీ గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లుల యజమానులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2024?25 ఖరీఫ్ సీజన్, 2024-25 రబీ సీజన్ కు మిల్లుల వారీగా వారికి కేటాయించిన ధాన్యం, డెలివరీ చేయకుండా పెండింగ్ లో ఉన్న ధాన్యం వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గడువులోగా పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎంఆర్‌ను సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారుఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 16-02-2026 చివరి తేదీ అని, రబీ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 28-02-2026 చివరి తేదీ అని వెల్లడించారు. జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడం మిల్లర్లు బాధ్యతగా భావించాలని సూచించారు. గత అనుభాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్ లో లక్ష్యాన్ని సమర్థవంతంగా చేరుకునేలా ముందుచూపుతో వ్యవహరించాలని ఆదేశించారు సమావేశంలో ఇంచార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి రాధాబాయి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్నదాన సత్రానికి 60 క్వింటాళ్ల బియ్యం అందజేత

ఎమ్మిగనూరు : మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలం శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిమిత్తం ఎమ్మిగనూరు శ్రీ భీరలింగేశ్వర వెల్ఫేర్ కమిటీ మరియు కురువ సంఘం ఆధ్వర్యంలో 60 క్వింటాళ్ల బియ్యం అందజేయడం జరిగింది. ఈ బియ్యాన్ని ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం, ఎర్రకోట, గోనేగండ్ల మండలం పిల్లిగుండ్ల, అల్వాల గ్రామాల నుంచి భక్తుల సహకారంతో సేకరించగా, మొత్తం 120 బియ్యం బస్తాలను ఈరోజు రెండు వాహనాల ద్వారా శ్రీశైలానికి తరలించారు.×ఈ పవిత్ర కార్యానికి సహకరించిన దాతలకు, కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసార్×ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మండలం కురువ సంఘం నాయకులు ఎర్రకోట అంపయ్య,ఐ ు ఉరుకుందు, డిగ్రీ కాలేజ్ మద్దిలేటి సార్ మసీద్ పురం ఆంజనేయ్య, ఎర్రకోట వెంకటరాముడు,బాపురం వెంకటాయుడు,బోడబండ హనుమంతు,ఐ రాము,మెకానిక్ బీరప్ప,ఐ.ఉ.మల్లయ్య, మేకల మల్లయ్య,ఎ.వెంకటేశు,గార్లదిన్నె రామంజి,దైనందిన్నె ఈరన్న,ఎర్రకోట నాగేష గోనెగండ్ల మండలం కురువ సంఘము నాయకులు పిల్లిగుండ్ల నాగన్న, కి.రంగస్వామి,ఎ శ్రీను, రామకృష్ణ,ఎ.మద్దిలేటి సర్పంచు (బాషా), గోపాలు,ఐ. నరసింహుడు,ఐ.బల రాముడు తదితరులు పాల్గొన్నారు.


## ఎంజేపీ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

బేతంచెర్ల : బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలోఉన్న మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల( బాలురు )ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు.అయన మాట్లాడుతూ...5 తరగతి ప్రవేశ పరీక్ష బ్యాక్ లాగ్ 6,7,8 తరగతులు, ఇంటర్ ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 4 నుండి మర్చి4 వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## బిజెపి తొలితరం నేత, దక్షిణ భారతదేశం

# తొలి బీజేపీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి

బిజెపి తొలితరం నాయకుడు, దక్షిణ భారతదేశం తొలి బీజేపీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి.. ఈయన 1935, నవంబరు 18న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలోని పరకాల గ్రామంలో జన్మించాడు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నివాసం హన్మకొండలో ఉన్నాడు. శ్రీమతి నందేష్మాను 1953లో వివాహమాడాడు. తెలంగాణ ప్రాంతానికి హనుమకొండ నుంచే 1984 వరంగల్ జిల్లాలో కాదు అప్పటి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి కావడం విశేషం. ఇక ఆ ఎన్నికల్లో వాజ్ పాయ్, అద్వానీ వంటి బీజేపీ అగ్రనాయకులందరూ పరాజయం



పాలయ్యారు. ఆ భారతీయ జనతా పార్టీ జిల్లాలో మొదటి వ్యక్తి. జంగారెడ్డి కొద్ది రోజులు ప్రభుత్వ పాఠశాలలో హయ్యర్ సెకండరీ (టీచర్) బడిపంతులుగా పనిచేశాడు. పరకాల నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా భారతీయ జనసంఘ పార్టీ నుండి ఇండిపెండెంట్ బి. కైలాసం పై గెలిచి శాసనససభలో అడుగుపెట్టాడు. ఇదే పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా మళ్ళి భారతీయ జనసంఘ పార్టీ నుండి 1972లో పోటీచేసి పింగళి ధర్మా రెడ్డి చేతిలో ఓటమి చెందాడు. తరువాత 1978లో మళ్ళీ పింగళి ధర్మా రెడ్డి పై శాసనసభ్యునిగా మళ్ళి భారతీయ జనసంఘ పార్టీ నుండి విజయం సాధించాడు. దీనికి వేదిక మాత్రం శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం అయింది. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సి రిజర్వ్ కావడం మూలానా ఇద్దరు కూడా రెడ్డి సామాజికవర్గం వారు కావడం వలన పరకాల పక్కనే ఉన్న జనరల్ సీటు శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి తలపడ్డారు.1984 లో భాజపా 543 నియోజకవర్గాలలో కేవలం రెండింటిని గెలుపొందింది ఒకటి అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్ లోని హనుమకొండ కాగా, ఏకే పటేల్ అనే బీజేపీ అభ్యర్థి గెలుపొందిన గుజరాత్ లోని మెహ్సానా నియోజక వర్గం రెండోది. హనుమకొండ నుంచే కాదు మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి. మాజీ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్‌లో కీలక నేతగా దేశంలోనే ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దివంగత మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు పై 54వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించి దక్షిణ భారతదేశం తొలి బీజేపీ తొలి పార్లమెంటు సభ్యుడుగా హనుమకొండ నుండి జంగారెడ్డి ఎంపికయ్యాడు. దక్షిణ భారతదేశం నుంచి ఆయనే తొలి బీజేపీ ఎంపీ కావడం ఓ రికార్డు. ఆ సమయంలో స్థానికుడు కావడం వలన అభిమానంతో జనం జంగారెడ్డిని ఆదరించారు. ఆ విజయం చరిత్ర పుటల్లో భద్రంగా ఉంది. 1989,1991,1996లో కాంగ్రెస్ పార్టీ నుండి కమాలుద్దీన్ అహ్మద్ చేతిలో జంగారెడ్డి భారతీయ జనతా పార్టీ నుండి పోటీచేసి ఓటమి చెందారు. జంగారెడ్డి 87 యేళ్ళ వయసులో అనారోగ్యంతో బాధపడుతూ 2022, ఫిబ్రవరి 5న హైదరాబాదులో మరణించాడు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై

# ఎన్డీయే ఎంపీలకు ప్రధాని ట్రేడ్ డీల్ అంశం

న్యూఢిల్లీ : అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలకు వివరించారు. ఈ ఒప్పందం ద్వైపాక్షిక సంబంధాలకు మైలురాయి అని, సవాళ్లను అధిగమించి సాధించామని మోదీ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలని ఎంపీలకు ప్రధాని సూచించారు. అమెరికా సుంకాలు తగ్గిస్తుందని, భారత్ కూడా తమ వస్తువులపై సున్నాకు తగ్గిస్తుందని ఒప్పందానికి అంగీకరించినట్టు అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే..ఎన్డీయే ఎంపీలతో జరిగిన అంతరంగిక సమావేశంలో అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం, పర్యవసానాల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ఎంపీలు చురుకుగా వ్యవహరించాలని, చర్చల్లో పాల్గొని, ప్రభుత్వ విజయాల గురించి ప్రజలకు నేరుగా తెలియజేయాలని ప్రదాని విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. పార్లమెంటరీ భాగస్వామ్యం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీయే ఎంపీలంతా సభలో పూర్తి హాజరును కొనసాగించాలని, కీలక అంశాలపై చర్చలకు సహకరించాలని ఆయన కోరారు.'ఎంపీలు అందరూ సభలో ఉండాలి, చర్చలో పాల్గొనాలి' అని ఆయన అన్నట్టు సమావేశం గురించి తెలిసిన వర్గాలు పేర్కొన్నాయి. నియోజకవర్గ ప్రజలను కలుసుకుని, ఇటీవల సమర్పించిన కేంద్ర బడ్జెట్ ముఖ్య విజయాలను హైలైట్ చేయాలని ఆయన వారిని ఆదేశించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ దీనిని ద్వైపాక్షిక సంబంధాలకు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించిన ఒక మైలురాయిగా అభివర్ణించారు. చర్చల సమయంలో ఎదుర్కొన్న సవాళ్లను ఆయన బయటపెట్టారు. విమర్శకులు సందేహాలు వ్యక్తం చేశారని, కానీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లిందని మోదీ వివరించారు.'ప్రజలు విమర్శిస్తున్నప్పటికీ, మేము ధైర్యం కోల్పోలేదు.. మా సహనం ఫలించింది. ప్రపంచ క్రమం మారుతోందని నేను అప్పుడే చెప్పాను' అని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రదాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడి మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం వాణిజ్య ఒప్పందంపై ప్రకటన వెలువడింది. ఈ ఒప్పందం ప్రకారం, భారతీయ వస్తువులపై ప్రస్తుతం ఉన్న సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది."భారత ప్రధానమంత్రి మోదీతో ఉన్న స్నేహం, గౌరవంతో పాటు ఆయన అభ్యర్థన మేరకు తక్షణమే అమల్లోకి వచ్చేలా అమెరికా, భారతదేశంమధ్య ఒక వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం.. దీని ప్రకారం పరస్పర సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గిస్తుంది' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో తెలిపారు. అంతేకాదు, అమెరికా వస్తువులపై సుంకాలను సున్నాకు తగ్గించడానికి భారత్ కట్టుబడి ఉందని అన్నారు. ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, ఇతర రంగాలతో సహా 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెప్పారు.

ఇక, ప్రధాని మోదీ సైతం గొప్ప మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు.అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్ తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొందన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ట్రంప్ ప్రకటనల వెనుక దాగివున్న అజెండాభారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "గతంలో 3-4 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు'' అని ఆయన వ్యాఖ్యానించారు.అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. "అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉంది" అని ఆయన అన్నారు.మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ మాట్లాడుతూ, "వాణిజ్య ఒప్పందం అయినా, మరో ప్రకటైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా? ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి? రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా? వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలి" అని డిమాండ్ చేశారు.రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. దూరదృష్టితో కూడిన చర్యభారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రశంసించిన జేపీ భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు.

ఇది దేశానికి గొప్ప శుభవార్త అని పేర్కొంటూ, ఈ విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్లిష్టమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, ప్రధాని మోదీ ఎంతో సంయమనంతో వ్యవహరించి జాతీయ ప్రయోజనాలను కాపాడారని ఆయన ప్రశంసించారు.

## మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు

సి.బెళగల్ : మండలంలోని కంబదహాల్ గ్రామ రైతు సేవ కేంద్రాల యందు పొలం పిలుస్తుందనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ నిర్వహించారు.రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం రబీలో సాగు చేస్తున్నపంటలను పరిశీలించడం జరిగినది. అందులో ముఖ్యంగా ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న మరియు శనగ పంటలు సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారి తెలియజేశారు. మొక్కజొన్నలో ప్రస్తుతం తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణలు గురించి రైతులకు వివరించారు మొదటగా మొక్కజొన్న విత్తనం వేసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు విత్తన శుద్ధికి ఫోర్టెంజా డుయె మందు ద్రావణాన్ని కలుపుకొని 6 ఎమ్ ఎల్ ఫర్ ఒక కేజీకి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా పురుగు ఆశించకుండా అంతర పంటలు అయినటువంటి కంది గాని సోయాబీన్ గాని అంతర పంట వేసుకోవాలని తెలిపారు. పది నుంచి 20 రోజుల్లో మొదటగా కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది దీని నివారణకు ఆసిఫేట్ 1.5 గ్రామ్ లేదా ఇమ్మిడా క్లోరోఫ్రైడ్ 0.3 మిల్లీమీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా నత్రజని భాస్వరం పొటాషియం ఎరువులు సమపాళ్లలో పంటకు అందించాలని తెలిపారు.అదేవిధంగా పంట వేసిన 70 రోజుల నుంచి 80 రోజుల కాలవ్యవధిలో మొక్కజొన్న పై ఎక్కువగా గొంగళి పురుగు మరియు కత్తెర పురుగు ఆశించినట్లయితే దాని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు లేదా స్పైనోసాడ్ 60 ఎమ్.ఎల్ లేదా ఎదిగిన గొంగళి పురుగు నివారణకు 10 కిలోల తౌడు రెండు కిలోల బెల్లం రెండు లీటర్ల నీరు కలిపి 24 గంటలు పులియబెట్టి ఆ మిశ్రమానికి 10 గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి సాయంత్రం వేళలో సుడులలో పడేటట్లు వేసుకోవాలి.ఒక ఎకరంనకు సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేసుకోవాలని తెలిపారు.రబీలో సాగు చేస్తున్నటువంటి పంటలను ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.అదేవిధంగా వ్యవసాయ అధికారుల సలహా సూచనలు పాటించాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఏఈవోలు శిరీష,హిమబిందు మరియు ఆ గ్రామ రైతు సేవ కేంద్ర ఇన్చార్జీలు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,రవి సాగర్,శేఖర్ రైతులు పాల్గొన్నారు.

## అపోలో నాలెడ్జ్ సిటీలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

చిత్తూరు: అపోలో నాలెడ్జ్ సిటీలో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్యాంపస్‌లో నిర్వహించిన సేవా, విద్యా, పర్యావరణ కార్యక్రమాలు అందరి మన్ననలను పొందాయి. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డా. ప్రతాప్ సి. రెడ్డి గారి సేవలను వక్తలు ఘనంగా కొనియాడారు. ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే దూరదృష్టితో డా. ప్రతాప్ సి. రెడ్డి గారు అపోలో సంస్థను స్థాపించి, భారతదేశ వైద్య రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతను వైద్య రంగంలో ప్రవేశపెట్టి, లక్షలాది మంది ప్రాణాలను కాపాడిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచారని తెలిపారు.అపోలో నాలెడ్జ్ సిటీ వంటి విద్యా, పరిశోధనా కేంద్రాల స్థాపన ద్వారా వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశోధన అవకాశాలు కల్పించడమే కాకుండా, సమాజానికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఆయన ఆశయానికి ఇది ప్రతీకగా నిలుస్తోందని వక్తలు అన్నారు.వేడుకలు ఉదయం రక్తదాన శిబిరంతో ప్రారంభమయ్యాయి. ంఏటూఖీ గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని అపోలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్. వినోద్ భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అత్యంత విలువైన మానవ సేవ అని, యువత సామాజిక బాధ్యతతో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.తదుపరి కార్యక్రమంగా క్రీడా మైదానంలో వ్యవస్థాపకుల స్మరణార్థం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ంఏటూఖీ డీన్ డాక్టర్‌ర్స్ఫేడ్ జె. ఆగస్టిన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి గారి దూరదృష్టి వల్లే అపోలో నాలెడ్జ్ సిటీ విద్యా రంగంలో విశేష గుర్తింపు పొందిందని తెలిపారు.అనంతరం కొత్తగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు ప్రారంభించారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని, ఈ మైదానం వారి శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.వేడుకల ముగింపుగా క్రీడా మైదానం సమీపంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జయంతి హాజరై, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భవిష్యత్ తరాలకు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సంస్థ విలువలు, సామాజిక బాధ్యతను చాటిచెప్పాయి. ఈ కార్యక్రమాల్లో యూనిట్ హెడ్ ఎస్. బాలరాజ్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక పత్రికలకు అక్రిడిటేషన్లను నిలుపుదల చేయవద్దు

విశాఖపట్నం: సర్కులేషన్ 5వేలు దాటిన స్థానిక పత్రికలకు వెరిఫికేషన్(పరిశీలన) చేసిన తర్వాతే ప్రెస్ అక్రిడిటేషన్లను జారీ చేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని పలు జర్నలిస్టు సంఘాల నేతలు సమాచార ,పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. సదారావుకు వినతి పత్రం అందజేశారు. నగరంలోని జిల్లా పరిషత్ జంక్షన్ లో గల ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ వెరిఫికేషన్ పేరుతో అక్రిడేషన్లు నిలుపుదల చేయటం లేదని విశాఖ జిల్లాలో ఈ రకమైన వేధింపులు తగవన్నారు. గత సంవత్సరం, అంతకు ముందు ఇదే రకంగా వెరిఫికేషన్ చేశారని మరో సారి వెరిఫికేషన్ దేనికని ప్రశ్నించారు. నిబంధనలు చిన్న పేపర్లకేనా మిగతా వాటికి వర్తించవా అని ప్రశ్నించారు. 5వేలు దాటిన చిన్న పత్రికలను వెరిఫికేషన్ చేయాలనే విషయం జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీలో సమగ్రంగా చర్చించకుండా కమిటీ సభ్యులుగా ఉన్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టుల ఆమోదం లేకుండా వెరిఫికేషన్ తగదన్నారు. సమాచార శాఖ అధికారుల ఉద్దేశాలను కమిటీపై రుద్ద వద్దని హితవు పలికారు. గత ప్రభుత్వం అక్రిడేషన్లు తగ్గించిందని తమ ప్రభుత్వం అక్రిడేషన్లు పెంచుతామని హామీ ఇచ్చి తీరా జీవో నెంబర్ 84 ద్వారా పెంచకపోగా తగ్గాయన్నారు. వాటిని కూడా లేకుండా చేయటం అన్యాయమని ఆయనకు తెలిపారు సర్కులేషన్ 5వేలు అయినా అంతకు మించినప్పటికీ వెరిఫికేషన్ ఆలోచనను వెనక్కి తీసుకుని రెగ్యులారిటీ కలిగిన పత్రికలకు ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ దృష్టిలో ఉంచి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిడి ని కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ,మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు కె .రాము, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి .సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక యూనిట్ అధ్యక్షుడు కె . పరశురాం, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్,ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధి రవికుమార్, సీనియర్ జర్నలిస్టు హరినాథ్, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కదలి రాజేంద్రప్రసాద్, ఎం. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు స్థానం లేదు

కోరుట్ల : పట్టణంలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు స్థానం లేదని కాంగ్రెస్ పార్టీ కష్టకలంలో ఉన్నప్పుడు పార్టీ జెండా మోసిన వారికి ప్రధాన్యత ఇవ్వకుండా ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి మాత్రం ప్రధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆవేదన వ్యక్తంచేశారు. తన కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తోపాటు తమ పదవి నుండి రాజీనామా చేస్తున్నానని పట్టణానికి చెందిన ఎంఏ వసీం ప్రకటించారు.తమ నివాసంలో వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎం ఏ వసీం మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు పార్టీని విడిచి అప్పుటి అధికారంలో ఉన్న పార్టీలలో చేరారని కానీ నేను మాత్రం కష్టపడి పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేశానని గుర్తు చేశారు. నేడు తమకు కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇవ్వకపోవడం చాలా అన్యాయమని ఆయన అన్నారు.తమ వార్డు కి చెందిన ప్రజలతో చర్చించి వారి యొక్క అభిప్రాయమేరకు భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES శుక్రవారం, ఫిబ్రవరి 6, 2026

# కత్తిపూడిలో ఘోర రోడ్డు ప్రమాదం

కాకినాడ : కత్తిపూడిలో రోడ్డు ప్రమాదంజరిగింది. ఆటో లారీని ఢీ కొట్టింది. ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా వుంది. పదిమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఉప్పాడ కొత్తపల్లి మండలం శ్రీరాంపురం నుంచి ప్రత్తిపాడు మండలం ధర్మవరం చెట్లు నరికేనీదుకు 15 మంది కూలీలతో వెళుతున్న ఆటో కత్తిపూడిలో పిఠాపురం నుంచి రౌతులపూడి వెళుతున్న టిప్పర్ లారీని ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శ్రీరాంపురం గ్రామానికి చెందిన పితాని కామరాజు (65) మృతి చెందారు. గాయాపడిన వారిని ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు.

# ప్రభుత్వ భూమి అక్రమణకు గురవుతోంది

కాకినాడ : జగ్గంపేట మండలం, గోవిందపురం గ్రామంలో రహదారి పక్కనే వున్న ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని ప్రభుత్వం. స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు ఎగుపాటి అర్జునరావు డిమాండ్ చేశారు. గోవిందపురం గ్రామ శివారున ఉన్న పొలం గల రైతు రహదారి పక్కనే ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని మేము జెండాలు వేసామని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. సర్వే నెంబర్ 72 లోని రైతు వారి పొలానికి చేర్చి ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పెన్సినింగ్ వేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని హెచ్చరించారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పై అనర్హత పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్ : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మీద దాఖలైన అనర్హత పిటీషన్ ను ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేసారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్కు క్లిన్ చిట్ ఇచ్చారు. ఆయన పార్టీ మారారు అనడానికి ఆధారాలు లేవని స్పీకర్ తేల్చి చెప్పారు. సంజయ్ బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి తరువాత కాంగ్రెస్ లో చేరారు. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే కానీ కాంగ్రెస్ పార్టీతో పనిచేస్తున్నాను. కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నానని సంజయ్ అంటున్నారు. సంజయ్ పార్టీ ఫిరాయించారని అయనపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసారు.

## వేములవాడ మున్సిపాలిటీలో

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

**-కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ**

వేములవాడ : వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పట్టణ ప్రజలు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ విజ్ఞప్తి చేశారు. వేములవాడ దేవస్థానం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు నిధులు వెచ్చించి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల వేములవాడ పట్టణానికి భక్తుల తాకిడి పెరిగి పట్టణవాసులకు ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం, రేషన్ కార్డు లేని వానికి రేషన్ కార్డులు మంజూరు చేశారని, సన్న వడ్లకు 500 బోనస్, రైతు భరోసా ను న్యాయంగా రావలసిన వారికి వర్తింపజేయడం, దాదాపు 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువచ్చింది అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలంటే మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గోటికార్ కిషన్ జీ కోరారు.

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్

# న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదు

**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**

హైదరాబాద్ : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారిన ఫిర్యాదును డిస్మిస్ చేసిన స్పీకర్ నిర్ణయం పై మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పందించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్దంగా ప్రవర్తించడం లేదని అన్నారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా.. స్పీకర్ కి కనపడకపోవడం విచారకరం, చర్య తీసుకోకపోవడం దురదృష్టకరం. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ చర్యల పట్ల ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరువుతున్నారు.. అది స్పీకర్ కి కనపడలేదు అంటా . స్పీకర్ ఆత్మసాక్షిగా, చట్ట పరంగా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. స్పీకర్ పిటిషన్ను డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమే. స్పీకర్ వదిలినా కోర్టుల్లో శిక్ష తప్పదు.. వాళ్లను డిస్మిస్ చేయడం ఖాయమని అన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో మహిళా న్యాయవాది దారుణ హత్య

రంగారెడ్డి : మొయినాబాద్ శివారులోని పొలం వద్ద చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవాది స్వప్నను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసారు. న్యాయవాది హత్య కేసులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ముందు న్యాయవాదులు ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో బీజాపూర్ హైవే పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల డిమాండ్

# భవనంపై నుంచి పడి కూలీకి తీవ్ర గాయాలు

**- సకాలంలో ఆదుకున్న 108 సిబ్బంది**

సంగారెడ్డి : జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని కాంతారెడ్డి కాలనీ లో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి రాజు (50) అనే కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తు కింద పడటంతో ఇనుప చువ్వలు కడుపులోకి గుచ్చుకున్నాయి. అల్గొల్ కు చెందిన అట్కారి శ్రీనివాస్ 108 సిబ్బంది బాధితుడిని చాకచక్యంగా రక్షించారు. చువ్వలను కత్తిరించి, ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్సకై సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించిన ఈఎంటీ సంగమేశ్వర్, పైలట్ శ్రీనివాస్ లను స్థానికులు అభినందించారు.

# కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

మెదక్ : నర్సాపూర్ లో ఆరు సంవత్సరాల పాపపై కోతులు దాడి చేసాయి. ఘటనలో చిన్నారికి కాలికి గాయాయ్యాయి. కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్న జోష్ణవి స్కూలుకు వెళుతుండగా కోతులు ముకుమ్మడిగా దాడి చేసాయి. టిఫిన్ బాక్స్ తో స్కూల్ బస్సు ఎక్కుతుండగా కోతులు దాడి కి దిగాయి. కుటుండికులు పాపను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

# మేయర్ పర్యటనలో ఉద్రిక్తత

సంగారెడ్డి : మేయర్ విజయలక్ష్మి పర్యటనలో ఉద్రిక్తత నెలకొంది. రామచంద్రాపురం పట్టణంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి కాన్వాయిని ఆర్ సీ పురం బిజెపి నాయకులు అడ్డుకున్నారు. స్థానిక హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కుర్మసంఘం భవన నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మేయర్ కాన్వాయ్ ను బిజెపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మేయర్ కాన్వాయ్ ముందు స్థానిక కార్పోరేటర్ కు, బిజెపి, నాయకుల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల రంగప్రవేశంతో వాగ్వివాదం సద్దుమణిగింది.

# సర్వశక్తులు ఒడ్డుతున్న హస్తం పార్టీ



హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ సర్వేలతో సర్వం పసిగట్టిందా.. అసలు ఈ సర్వేలు తమకి అనుకూలంగా ఉన్నాయా..? ప్రతికూలంగా ఉన్నాయా..? ఓ వైపు ప్రయివేట్ సంస్థల సర్వేలు,మరోవైపు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ సర్వేలలో ఎక్కడ ద్విముఖ పోరు ఉండనుంది? ఎన్ని స్థానాల్లో త్రిముఖ పోరు ఉంటుంది...కొన్ని స్థానాల్లో నేతలకు సీఎం డైరెక్ట్ కాల్ చేసి భరోసా ఇవ్వడంలో మతలబు ఏంటి..? ఇంత కీ మున్సిపోల్స్ హస్తంపార్టీ హస్తగతం అయ్యేనా..?..కాంగ్రెస్ నేతలు మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెంచుతున్నారు. హస్తం నేతలు నాలుగు ప్రయివేట్ సంస్థలతో చేయించిన సర్వే రిపోర్టులు అందినట్లు సమాచారం. ప్రయివేట్ సంస్థల రిపోర్టులతో పాటు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ రిపోర్టులను అధ్యయనం చేసిన హస్తం నేతలు తాము అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యే అవకాశం ఉందని ధీమాగా ఉన్నారు. విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడిపిన సీఎం రేవంత్ సైతం తెలంగాణకి రావడంతోనే సర్వే రిపోర్టులు పరిశీలించినట్లు సమాచారం. రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నాయని, ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటే తొంభై శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవచ్చని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం..సర్వే రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నప్పటికీ పలు విషయాల్లో హస్తం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడైనట్లు తెలుస్తోంది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం కావడంతో పాటు అర్బన్ ప్రాంతంలో హిందుత్వ ప్రభావం ఉండడంతో ఉత్తర తెలంగాణలోని పలు మున్సిపాలిటీలలో బీజేపీకి అనుకూలంగా ఉంది. ఆ స్థానాల్లో త్రిముఖ పోరు ఉండనున్నట్లు హస్తం నేతలు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ ఉన్న దగ్గర ఏవిధంగా ప్రచారం చేయాలో సీఎం రేవంత్ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. మైనార్టీ ఓటు బ్యాంకు కాంగ్రెస్ కు పడే విధంగా చూడడంతో పాటు, హిందుత్వ ఓటు బ్యాంకు చీలకుండా ఉండేందుకు సీఎం రేవంత్ కొత్త ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను నేతలకు వ్యక్తిగతంగా కాల్ చేసి వివరించడానికి సీఎం సిద్ధమైనట్లు సమాచారం..దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడింది. ఈ ప్రాంతంలో దాదాపుగా ద్విముఖ పోరు ఉంటుందని హస్తం నేతలు అంచనా వేశారు. ఈ స్థానాల్లో గత పదేళ్లలో కేసీఆర్ చేసిన వైఫల్యాలను ఎండగట్టేలా ప్రచార వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇక పార్టీకి ఇబ్బందిగా ఉన్న నియోజవర్గాల లిస్ట్ కూడ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో లోకల్ గా ఉన్న సమస్యలను గుర్తించి దానికి అనుగుణంగా మేనిఫెస్టో సిద్ధం చేయాలని సీఎం రేవంత్ సూచించినట్లు సమాచారం.వాయిస్..నాయకుల మధ్య అంతర్గత పోరు, ఆధిపత్య ఇబ్బందులున్న నియోజకవర్గాలను సైతం ప్రత్యేకంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఆయా నియోజవర్గాల నాయకుల మధ్య సమన్వయం కుదిర్చే బాధ్యతను పలువురు సీనియర్ నేతలకు సీఎం రేవంత్ అప్పగించారు. ఆ నేతలు సీఎం రేవంత్ దూతగా ఆయా నియోజకవర్గాలకు వెళ్లి నేతలతో మాట్లాడి వారి మధ్య సమన్వయం కుదిర్చి రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సర్వేలు అనుకూలంగా ఉన్నాయి కదా అని నేతలు రిలాక్స్ అయితే ఊరుకునేది లేదని సీఎం వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం.ఎన్నికలు ముగిసి మున్సిపల్ చైర్మన్ల,మేయర్లఎన్నిక జరిగేదాక కీలక నేతలంతా నియోజకవర్గాల పరిధిలోనే ఉండాలని సీఎంఆదేశించారు.ఇక తొంబై శాతం టార్గెట్ పెట్టుకున్న కాంగ్రెస్ ఎంత శాతం సక్సెస్ అవుతుందో వేచి చూద్దాం...

# మణిపూర్ కొత్త సీఎంగా కేమ్‌చంద్


ఇంపాల్ : మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాష్ట్రపతి పాలన త్వరలో ముగియనుంది. ఈ ఈశాన్య రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ ఎన్నికయ్యారు. కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన రాష్ట్రంలో, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. బీరేన్ సింగ్ సహా ఐదుగురి పేర్లు పరిశీలించిన తర్వాత కేమ్‌చంద్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. దీంతో ఆయన మణిపూర్‌కు రెండో బీజేపీ సీఎం కానున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. ఈశాన్య రాష్ట్రంలో మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతోన్న రాష్ట్రపతి పాలన త్వరలోనే ముగిసి, ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారం చేపట్టనుంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ (62) ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కేమ్‌చంద్‌ను తమ నాయకుడిగా బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. రెండేళ్లకుపైగా కుకీ, మైతీ తెగల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో ఏడాది కిందట ముఖ్యమంత్రి పదవికి బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా కేమ్‌చంద్‌కు అవకాశం కల్పించింది. మణిపూర్ రాష్ట్రానికి రెండో బీజేపీ సీఎం కాబోతున్నారు. సీఎం రేసులో బీరేన్ సింగ్ సహా ఐదుగురు పేర్లు వినిపించగా.. కేమ్‌చంద్‌వైపు అధిష్ఠానం మొగ్గుచూపింది. మే 2023లో మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో హింస చెలరేగి వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులు కాగా.. ఆస్తులు భారీ ఎత్తున ధ్వంసమయ్యాయి. న్యూఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు సమావేశమై మణిపూర్ కొత్త సీఎం ఎంపికపై చర్చించారు. అనంతరం ఇంఫాల్‌లో జరిగిన బీజేపీ లేజిస్లేటివ్ పార్టీ సమావేశంలో మాజీ స్పీకర్ అయిన కేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు.

ఇక, కేమ్‌చంద్ సింగ్జామై నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి 2017 ఎన్నికల్లో గెలిచిన ఆయనకు స్పీకర్ పదవి వరించింది. ఐదేళ్ల పాటు పూర్తికాలం స్పీకర్‌గా కొనసాగారు. మళ్లీ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించారు. మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితులు చక్కబడినట్టు పైకి కనిపిస్తున్నా.. పది రోజుల కిందట తన భార్యను చూసేందుకు నేపాల్ నుంచి వచ్చిన మైతీ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. భార్యతో సంతోషంగా గడుపుతున్న అతడ్ని.. ముసుగులు ధరించి వచ్చిన కొందరు దుండగులు విచక్షణారహితంగా కాల్చి చంపారు.

# ఎన్నికలకు దూరంగా అన్నామలై, దినకరన్

చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఎన్డీయే కూటమిలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. గత కొంతకాలంగా రాష్ట్ర బీజేపీని ఉరకలెత్తించిన మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై, ఎన్నికల వ్యూహకర్తగా పేరున్న ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ ఇద్దరూ ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అన్నాడీఎంకే తో పొత్తు కుదిరినందున సీట్ల సర్దుబాటు , అంతర్గత సమీకరణాల దృష్ట్యా వీరిద్దరూ దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. పళని స్వామికి.. వీరికి సరిపడని రాజకీయాలు ఉన్నాయి. అన్నాడీఎంకేతో పొత్తు కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి అన్నామలై గతంలో వైదొలగారు. ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకేతో పొత్తు పునరుద్ధరణకు అన్నామలై వైఖరి కొంత అడ్డంకిగా ఉందని భావించిన బీజేపీ అధిష్టానం, అతన్ని పక్కన పెట్టింది. ఇప్పుడు ఏకంగా ఎన్నికల బాధ్యతల నుంచే తప్పించింది. రాష్ట్రంలో కూటమి గెలుపు కోసం ఆయన పర్యవేక్షణ బాధ్యతలకు మాత్రమే పరిమితం కానున్నారు. మరోవైపు, ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ కూడా ఈసారి ఎన్నికల్లో పోటీ చేయకూడదని సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేని జిల్లాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. తన శక్తియుక్తులను అభ్యర్థుల గెలుపు కోసమే వెచ్చిస్తానని, పార్టీ కేడర్‌ను ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చూడటమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే కూటమికి ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వం వహిస్తారని ఆయన స్పష్టం చేయడం ద్వారా కూటమిలోని ఐక్యతను చాటిచెప్పారు. ఈ ఇద్దరు కీలక నేతలు పోటీ నుంచి తప్పుకోవడం అధికార డీఎంకే కూటమికి వ్యూహాత్మకంగా లాభిస్తుందా లేక ఎన్డీయేలోని ఇతర అభ్యర్థులకు బలం చేకూరుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. అటు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ కూడా బలంగా పుంజుకుంటున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో ఓట్ల చీలికను అరికట్టడమే లక్ష్యంగా బీజేపీ–అన్నాడీఎంకే కూటమి ఈ త్యాగాల ' వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# వికారాబాద్‌లో వేడెక్కిన రాజకీయం




హైదరాబాద్ : పురపాలిక ఎన్నికలు సమీపించిన వేళ వికారాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకే కాకుండా స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారుల పాత్ర మరింత కీలకంగా మారిందని తెలుస్తోంది. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో మొత్తం వందకు పైగా వార్డులు ఉండగా, వాటిలో 30 నుంచి 40 వార్డుల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. నేరుగా బరిలోకి దిగడం, లేదా అనుచరులను రంగంలోకి దించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. ఎన్నికల్లో నేరుగా పోటీ చేసి గెలవకపోయినా, రిజర్వేషన్ విధానం ప్రకారం ఛైర్మన్ పదవులు దక్కించుకోవచ్చన్న లెక్కలతో చాలామంది వ్యాపారులు ముందడుగు వేస్తున్నారు. వార్డుల ఫలితాల ఆధారంగా బలమైన కౌన్సిలర్ల మద్దతు సాధిస్తే, తర్వాత ఛైర్మన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించవచ్చన్నది వారి వ్యూహం. అందుకే ఇప్పటి నుంచే అన్ని విధాలా సిద్ధమవుతూ రాజకీయ సమీకరణాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.: తాండూరులో ఒక ప్రముఖ స్థిరాస్తి వ్యాపారి ఎన్నికల గోదాలోకి దిగకముందే తన వ్యూహాన్ని అమలు చేశారు. పోటీ చేయనున్న వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి, స్థానిక సమస్యలపై చర్చించారు. ఓటు బ్యాంకు ఉన్న నాయకులను గుర్తించి వారికి తాయిలాలు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే పట్టణంలో ప్రధాన పార్టీ అభ్యర్థికి దీటుగా మరో పార్టీ నుంచి స్థిరాస్తి వ్యాపారి బరిలోకి దిగుతున్నారని సమాచారం. దీంతో తాండూరులో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. వికారాబాద్ పట్టణంలో కొన్ని వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను స్థిరాస్తి వ్యాపారులు భరిస్తున్నారన్న ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ప్రచారం, సభలు, వాహనాలు, కార్యకర్తల నిర్వహణ వంటి అంశాలకు భారీగా ఖర్చు అవుతుండటంతో అభ్యర్థులు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీని ద్వారా వ్యాపారులు భవిష్యత్తులో పురపాలిక నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్, పరిగి పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులు స్వయంగా పోటీ చేస్తుండగా, మరికొన్ని చోట్ల అనుచరులను బరిలోకి దింపుతున్నారు. స్థానిక రాజకీయ నాయకులతో పొత్తులు పెట్టుకుని, గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగు లు వేస్తున్నారు. ఈ పరిణామాలు పురపాలిక రాజకీయాలపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతోందో సూచిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా పురపాలికలకు హైదరాబాద్‌తో ఉన్న అనుసంధానం స్థిరాస్తి వ్యాపారుల రాజకీయ ఆసక్తికి ప్రధాన కారణంగా మారింది. హైదరాబాద్ నుంచి 78 నుంచి 119 కిలోమీటర్ల దూరంలోనే ఈ పట్టణాలు ఉన్నాయి. రాజధాని పరిసరాల్లో ఎకరం భూమి ధర రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా, ఈ పురపాలికల సమీపంలోని భూములు రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు మాత్రమే ఉన్నాయి. ఈ ధరల తేడానే పెట్టుబడిదారులను ఇక్కడికి ఆకర్షిస్తోంది. హైదరాబాద్ వ్యాపారులు స్థానికులతో కలిసి భూములు కొనుగోలు చేసి, వెంచర్లు అభివృద్ధి చేసి భారీ లాభాలు పొందుతున్నారు. కొందరు స్థిరాస్తి వ్యాపారులు నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకుండా, వెనకుండి తంతు నడుపుతున్నారు. తమకు నమ్మకమైన అనుచరులను బరిలోకి దింపి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నారు. అనుచరులు గెలిచిన తర్వాత కీలక సందర్భాల్లో ఛైర్మన్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి, భవిష్యత్తులో పురపాలిక ద్వారా లాభాలు పొందాలన్నది వారి ఆలోచన. మొత్తంగా చూస్తే, వికారాబాద్ జిల్లా పురపాలిక ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం ఈసారి మరింత పెరిగింది. రాజకీయాలు, వ్యాపారం ఒకదానితో ఒకటి ముడిపడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, భవిష్యత్తులో పురపాలికల పాలనపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతుందన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

# బంగారం ధర పెరుగుదలతో వర్సిటీలకు కొత్త కష్టాలు..!

హైదరాబాద్ : భారీగా పెరుగుతున్న బంగారం ధరలు తెలంగాణలోని వర్సటీలకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టాయి. ధరలు పెరుగుతుండటంతో విద్యార్థులకు ఇచ్చే బంగారం పథకాల తయారీకి అధిక వ్యయం అవుతోంది. దీంతో డిపాజిట్ మె?త్తాన్ని పెంచాలని కోరుతూ వర్సటీ అధికారులు దాతలకు లెటర్లు రాస్తున్నారు. దాంతో పాటుగా గోల్డ్ మెడల్స్ తయారీలో గోల్డ్ వినియోగాన్ని గ్రాము వరకు తగ్గించి ఇతర లోహాలను కలిపి తయారు చేయిస్తున్నారు.బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత వారం క్రితం అయితే రికార్డు స్థాయికి ధర చేరుకుంది. సామాన్యులు బంగారం, వెండి కొనుగోలు చేయాలంటేనే వణికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్టుగా.. బంగారం ధర పెరగటంతో వర్సటీలకు కొత్త కష్టాన్ని తెచ్చిపెట్టింది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా అనూహ్యంగా పెరగడంతో వర్సటీల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించే బంగారు పతకాల బరువు క్రమంగా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్సటీలు అప్రమత్తమయ్యాయి.పతకాలను ప్రవేశపెట్టిన దాతలకు డిపాజిట్ నిధి మొత్తాన్ని పెంచాలని లేఖలు రాసేందుకు రెడీ అవుతున్నాయి. మార్చి 7న జేఎన్‌టీయూహెచ్ 14వ స్నాతకోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో డిపాజిట్ పెంచాలని లెటర్స్ రాస్తున్నారు. ఇక గత ఏడాది జూన్‌లో జరిగిన 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు బహుకరించే 20 గ్రాముల పతకంలో వెండి, రాగితోపాటు మూడు గ్రాముల బంగారం వినియోగించారు. ఈసారి బంగారం పరిమాణాన్ని మూడు నుంచి రెండు గ్రాములకు తగ్గించారు. ఆ మేరకు వెండి, రాగిని పెంచినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 71 పతకాలను ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించనున్నారు. అందులో కొన్నింటిని వర్సిటీలు సొంత నిధులతో ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని దాతల సహకారంతో సమకూరుస్తున్నారు.గత అక్టోబరులో పాలమూరు వర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించారు. అందులో 20 గ్రాముల పతకంలో 0.9 గ్రాముల బంగారం, 17.10 గ్రాముల రాగి, రెండు గ్రాముల వెండి వడినట్లు పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.రమేశ్‌బాబు వెల్లడించారు. ఒక్కో పతకానికి రూ.15 వేల వరకు ఖర్చు అయినట్లు తెలిపారు. ప్రస్తుతం దాతలు పతకాన్ని ప్రవేశపెట్టాలంటే ఆయా వర్సిటీలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ముందస్తు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

వాటిని ఎండోమెంట్ మెడల్స్‌గా పిలుస్తారు. డిపాజిట్ చేసిన మొత్తంపై వచ్చే వడ్డీతో బంగారు పతకాలు తయారు చేసి స్నాతకోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేస్తుంటారు.బంగారం ధర ఊహకందని విధంగా భారీగా పెరిగిపోతుండటం.. వచ్చే వడ్డీ సరిపోవటం లేదు. దీంతో కొన్ని వర్సిటీలు మరికొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలని దాతలకు లేఖలు రాస్తున్నాయి.

# అంతర్జాతీయ కోర్టుకు ఇండియా వార్నింగ్

ముంబై : పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున పాకిస్తాన్‌పై భారత్ చర్యలకు దిగింది. ఇందులో భాగంగా 1969 నాటి సిందూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీంతో పాకిస్తాన్‌కు నీటి సరఫరా నిలిపివేసింది. సిందూ నదిపై కొత్తగా ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీంతో పాకిస్తాన్‌లో పంటలు ఎండుతున్నాయి. కరువు ఛాయలు అలుముకున్నాయి. సిందూ జలాలు ఇవ్వకపోతే రక్తం పారిస్తామని బెదిరించింది. కానీ భారత్ భయపడలేదు. దీంతో నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు భారత్‌ను వివరాలు కోరింది. కోర్టు ఆదేశాలను భారత్ స్పష్టంగా తిరస్కరించింది. జలవిద్యుత్ ప్రాజెక్టుల 'పాండేజ్ లాగ్‌బుక్'లు సమర్పించాలని కోరినా, భారత్ దాన్ని పాటించే ప్రసక్తి లేదని ప్రకటించింది. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో పీస్ ప్యాలెస్‌లో జరిగిన విచారణకు భారత్ దూరంగా ఉంది.భారత్ పేర్కొన్న ముఖ్య అంశం, సీవోఏ ఏర్పాటు చట్టవిరుద్ధం. దానికి ఎటువంటి చట్టబద్ధత లేదని కొట్టిపారేసింది. 2025 ఏప్రిల్ 23న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ఈ ప్రతిష్టంభన. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరుల మరణానికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఆరోపించి ఈ నిర్ణయం తీసుకుంది.సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పాకిస్తాన్‌కు నీటి సరఫరా చేయలేనని భారత్ గట్టిగా చెప్పింది. ఒప్పందం తాత్కాలికంగా పక్కనపెట్టినందున అంతర్జాతీయ వేదికలకు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాక్ వ్యవసాయం సింధు నదులపై ఆధారపడుతుండటంతో తర్బేలా, మంగ్లా జలాశయాల్లో నీరు ప్రమాద స్థాయిలో ఉంది.భారత్ పాల్గొనకపోయినా, కోర్టు పాక్ విన్నపాన్ని ఆధారంగా విచారణ కొనసాగిస్తోంది. సమాచారం ఇవ్వకపోతే ప్రతికూల ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించింది. భారత్ ఇది ఏకపక్షీయమని, యథార్థాలను విస్మరించినదని వాదిస్తోంది.ఈ ప్రతిష్టంభన సింధు వివాదాన్ని నీటి పంపకాలకు మించి భారత–పాక్ దౌత్య యుద్ధంగా మార్చింది.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES
శుక్రవారం, ఫిబ్రవరి 6, 2026

## గుణదల లూర్ధుమాత మహోత్సవాలకు సర్వం సిద్ధం

విజయవాడ ఫిబ్రవరి 9,10,11, మూడు రోజులు పాటు జరిగే గుణదల లూర్ధుమాత మహోత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నామని తెలగతోటి జోసెఫ్ రాజారావు తెలిపారు. గుణదల సోషల్ సర్వీస్ సెంటర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో విజయవాడ కెదలిక్ పీఠం బిషఫ్ తెలగతోటి జోసెఫ్ రాజారావు మాట్లాడుతూ ఈ 102 వసంతాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించబోతున్నామని గుణదల కొండ దిగువన ఉన్న సెయింట్ జోసెఫ్ ఐటిఐ ప్రాంగణంలో మూడు వేల మంది భక్తులు కూర్చుని పూజా కార్యక్రమాలు తిలకించే విధంగా ఆధునిక హంగులతో భారీ చర్చి నిర్మాణం జరుగుతుందని ఈ చర్చి డిసెంబర్ 2026 నాటికి ప్రారంభోత్సవం చేయడానికి శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 8వ తారికు వరకు నవదిన ప్రార్థనలు,ప్రతి రోజు దివ్యసమిష్టి పూజబలి అనంతరం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయనిఈ మహోత్సవాలకు కడప, విశాఖపట్నం పీఠాధిపతులు ముఖ్యఅతిథిలుగా పాల్గొని ప్రార్థనలు, బోధనలు అందజేస్తారని అన్నారు. దేశ నలుమూలల నుండి10 లక్షలు మంది వస్తారని అంచనా అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విజయవాడ కెదలిక్ పీఠం బిషఫ్ తెలగతోటి జోసెఫ్ రాజారావు,ఫాథర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫా యం గాబ్రియెల్, రెక్టర్ ఫాదర్ యెలేటి విలియమ్ జయరాజు స్వామి, డైరెక్టర్ ఫాదర్ కోలకాని మరియన్న, సోషల్ సర్వీస్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు, పొక్రైటర్ ఫాదర్ జి కిరణ్ బాబు,తదితర గురువులు పాల్గొన్నారు.

## రైతులకు రీసర్వే పాస్ బుక్కులు పంపిణీ

తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని గల రాతన గ్రామం నందు టిడిపి నాయకులు మనోహర్ చౌదరి,గోవిందరెడ్డి,కృష్ణమూర్తి చౌదరి, ఆర్.ఐ వెంకట్ రాముడు,రాతన వీఆర్వో నాగేంద్ర లు రైతులకు రాజముద్ర తో కూడిన రీసర్వే పాస్ బుక్కులను సోమవారం రోజున పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీసర్వే అనంతరం రాజముద్రతో కూడిన నూతన పాసు బుక్కులను రైతులకు అందజేశామన్నారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జగన్ పాసు పుస్తకాలను రద్దుచేసి,ఆంధ్రప్రదేశ్ రాజముద్ర తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు పంపిణీ చేశారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో రంగన్న,విలేజ్ సర్వేయర్ రాజేంద్ర,గ్రామ రైతులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దేవినేని అవినాష్ చరిత్ర చాలా ఉంది

విజయవాడ : వైఎస్సార్ పార్టీని ప్రజలు ఛీ కొట్టారు. ప్రతి రోజు టిడిపి నాయకులపై నోరు పారేసుకున్నారు. దేవినేని అవినాష్ చరిత్ర చాలా ఉంది. ఎంపి చిన్ని మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. మీ కుటుంబ రక్త చరిత్ర ఎవరిని అడిగినా చెపుతారు. ఎంపీ కేశినేని చిన్ని మీకు నచ్చలేదు. కబ్జాలు, ఇసుక లాంటి మాఫియాలు చేసే వాళ్ళు నచ్చుతారు ఎక్కడ అవకాశాలు ఉంటే అక్కడ దురుతారు. గతంలో చంద్ర బాబు, లోకేష్ వెంబడి తిరిగిన వాళ్ళు మీరు. తెలుగు దేశం జెండా కప్పుకొని చనిపోతా అని మీ నాన్న అన్నారు. మీ నాన్న మాటలకు విరుద్ధం ప్రవర్తిస్తున్నారు.. అంబటి రాంబాబు, జోగి రమేష్ మాటలను మీరు విమర్శించాలని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతాఉల్లా దేవినేని అవినాష్ ను ఉద్దేశించి అన్నారు. అయన మీడియాతో మాట్లాడారు. మీ భజన చేసే పత్రికల్లో ఇష్టం వచ్చినట్లు రాపిస్తున్నారు.జోగి రమేష్ ఇంటికి వెళ్ళి ధర్నా చేశామని చెప్పాం.చంద్రబాబు, లోకేష్, చిన్ని ఆదేశాలతో బ్లేడ్ బ్యాచ్ తో వెళ్ళి దాడి చేశామని రాపిస్తున్నారు.. ముస్లిం నాయకులు కనపడకూడదు అని ఇలా చేస్తున్నారు.. ముస్లిం నాయకులకు ధర్నా చేసే అధికారం కూడా లేదా. మైనార్టీ నాయకుల మీద ఇష్టం వచ్చినట్లు రాపిస్తారు.

## పాత తరం పాత్రికేయులను మార్గదర్శకంగా తీసుకోవాలి

హైదరాబాద్ : తెలంగాణ మీడియా అకాడమి ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయులపై అకాడమి ప్రచురించిన చిరు పుస్తకాల (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ, ఇటీవల మరణించిన పాత్రికేయుల కుటుంబాల పెన్షన్ చెక్కుల ప్రదాన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, విద్యా, ప్రజా వ్యవహారాల సలహాదారు కె. కేశవ రావు, తెలంగాణ అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ మోనోగ్రాఫ్ పుస్తకాలు యువ జర్నలిస్టులు చదవాలి. సీనియర్ పాత్రికేయుల అనుభవాలు , ఆలోచనలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఇది నేటి జర్నలిస్టులకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. పాత్రికేయులుగా పని చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు మీడియా అకాడమి అండగా నిలవడం అభినందనీయం. వారి కుటుంబాలకు అండగా ఉన్నామని చెప్పేందుకు పెన్షన్ ఇస్తున్నారు. పాత్రికేయ రంగం అంటే ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. సోషల్ మీడియా వచ్చాక వారిపై మరింత ఒత్తిడి పెరిగింది. సమాజంలో మార్పు తీసుకురావడంలో పాత్రికేయులది కీలక పాత్ర. పాత తరం పాత్రికేయులను మార్గదర్శకంగా తీసుకొని కొత్తవారు ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నారు.

## పాత కక్షల నేపథ్యంలో బాబాయ్ హత్య

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలో పట్టపగలే నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు.హత్య చేసిన నిందితుడు దారూర్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. హత్యకు గురైన వ్యక్తి దారూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శంకర్ గా గుర్తించారు స్థానికులు. గతంలో భూ వివాదంలో ఉన్న పాత కక్షల కారణంతో సొంత అన్న కొడుకే బాబాయ్ ని హత్య చేసాడని చెప్పున్నారు గ్రామస్థులు. దారూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## చిన్నరాయిగూడెం అడవులపై మాఫియా దాడి

భద్రాద్రి కొత్తగూడెం : మణుగూరు మండలం గుట్ట మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నరాయిగూడెం ప్రాంతంలో అక్రమ ఇసుక మాఫియా యథేచ్ఛగా చెలరేగిపోతోంది. కోడి ముత్యయ్య గుంపు ఆధ్వర్యంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అడవులను నరికి, కొండలను చెరిపి, రహదారులు వేసుకుంటూ ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు మౌనంగా మారారని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇసుక దందా కోసం కొన్ని కిలోమీటర్ల మేర అరణ్యాన్ని ధ్వంసం చేయడం పర్యావరణంపై జరిగిన ఘోర నేరమని మండి పేర్కొంది. చెట్ల నరుకుడు వల్ల గ్లోబల్ వార్మింగ్ ముప్పు పెరుగుతోందని, అడవి జంతువుల నివాసాలు నాశనం అవుతున్నాయని, జీవ వైవిధ్యం పూర్తిగా అంతరించిపోతున్నా అటవీశాఖ మాత్రం జిడా ఇసుక కాంట్రాక్టర్లకు అండగా నిలుస్తోందని మండిపడ్డారు.అసలు ప్రభుత్వ అనుమతులు లేకుండా అడవుల్లో తవ్వకాలు చేసే హక్కు ఎవరు ఇచ్చారు?అటవీశాఖ అధికారులే ఈ అక్రమాలకు రక్షణగా నిలిచారా? అంటూ మహిళా మండలి సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు.అక్రమ ఇసుక రవాణాకు సహకరిస్తున్న అటవీశాఖ అధికారులపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే చిన్నరాయిగూడెం ఇసుక రాంపులను మూసివేసి, అక్రమ లారీ రవాణాను ప్రత్యక్షంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఇది హెచ్చరిక కాదు ? ప్రజా ఉద్యమానికి ఆరంభమని వారు తేల్చిచెప్పారు. ఈ ఘోర అక్రమాలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, జిల్లా అటవీశాఖ అధికారి, అటవీశాఖ సూపరింటెండెంట్ మరియు భద్రాచలం ఐటిడిఏ పీవోలకు ఇప్పటికే ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. అయినా చర్యలు లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రేణుక అక్షర మహిళా మండలి హెచ్చరించింది.

## ముడి పొగాకు ఉత్పత్తులపై సున్నా సుంకం

### కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్ కు మద్దతు తెలిపిన ఏపీ

### రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరువ్యాపారులకు ప్రయోజనమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 04: ఎలాంటి బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నాకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది రాష్ట్రంలో జరిగే అన్ బ్రాండెడ్ పొగాకు వాణిజ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. శుద్ధి చేయని పొగాకుకు(హెచ్ఎస్ కోడ్ 2401) వర్తించే సుంకం విధానాన్ని స్పష్టం చేస్తూ ఆర్థిక శాఖ ఈ గెజిట్ ను జారీ చేసింది. ఇక నుంచి అన్ బ్రాండెడ్ పొగాకు రీటైల్ విక్రయాలకు ఎక్సైజ్ సుంకం సున్నా గా పేర్కొంటూ ఈ గెజిట్ ను కేంద్రం విడుదల చేసింది. పొగాకు విక్రయాలపై పన్నుల విషయంలో ఏకరూపత, స్పష్టత, పారదర్శకంగా ఉండేలా ఈ గెజిట్ ను కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకమైన ముందడుగని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఎలాంటి బ్రాండ్ లేని బల్క్ పొగాకు క్రయ విక్రయాలు, వాణిజ్యానికి స్పష్టమైన తేడా లేకపోవటంతో చట్టంలోని వేర్వేరు నిబంధనల కారణంగా ఇబ్బందులు తలెత్తేవి. ఈ తరహా అస్పష్ట విధానాల కారణంగా రైతులు, వ్యాపారులు నష్ట పోతున్న నేపథ్యంలో అన్ బ్రాండెడ్ ఉత్పత్తుల సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ గెజిట్ ద్వారా ఎక్సైజ్ డ్యూటీ విధింపులో వేర్వేరు వర్గీకరణల వల్ల జరిగే ఇబ్బందులు తగ్గనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పొగాకు రైతులందరికీ మేలు చేసే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులకు మంచి ధర దక్కటంతో పాటు వ్యాపారులకు, ఎగుమతులకు కూడా ప్రయోజనం చేకూర్చనుందని వివరించారు. స్పష్టమైన మార్గదర్శకాలు, నిబంధనల కారణంగా ఎక్సైజ్ డ్యూటీ ఎగవేత గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తప్పుడు మార్గాల్లో పన్ను ప్రయోజనాలు పొందకుండా అడ్డుకునేలా ఉన్న ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థిస్తుందని అన్నారు. ఈ నోటిఫికేషన్ను దేశవ్యాప్తంగా ఒకేలా కఠినంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుకు ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## భక్తిశ్రద్ధలతో బిజిగిర్ షరీఫ్ గ్రామంలో షబేబరాత్ వేడుకలు

జమ్మికుంట : ముస్లింల పవిత్ర మాసమైన షాబాన్ సందర్భంగా జమ్మికుంట మండలం బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని జామే మస్జిద్ హజ్రత్ సయ్యద్ ఇంకుషావలీ రహమతుల్లాహ్ అలై దర్గాలో మంగళవారం రాత్రి భక్తి పారవశ్యంతో ముస్లిం సోదరులు షబేబరాత్ వేడుకలు జరుపుకున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవులందరి భవిష్యత్తుకు షబ్ ఎ-బరాత్ రాత్రి మార్గనిర్దేశనం చేస్తాడని ముస్లింల విశ్వాసం, ఈరోజు అల్లాహ్ తన భక్తుల 'రిజక్' (జీవనోపాధి)ని తదుపరి సంవత్సరానికి నిర్ణయిస్తాడు. రాబోయే ఏడాదికి ఎవరు ఏమి సాధిస్తారు? ఎవరికి ఎంత జీవనోపాధి లభిస్తుంది? ఇలా ప్రతి ముస్లిం యొక్క విధిరాత ఈరాత్రి నిర్ణయించబడుతుంది. అల్లాహ్ అందరి పాపాలు క్షమించడమే కాకుండా, ఏడాది పొడవునా చేయవలసిన కార్యాలను కూడా తన సేవకులలో ప్రతి ఒక్కరికీ పంచిపెడతాడు.ప్రతి వ్యక్తి ఏడాదిలో చేసిన పాప పుణ్యాల లెక్కలు కూడా ఈ రాత్రికి అల్లాహ్ ఎదుట ప్రవేశపెట్టబడుతాయి అని ప్రతి ముస్లింల విశ్వాసం. షబ్ ఎ-బరాత్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర ఖురాన్ ను పఠించినారు. మానవజాతి శ్రేయస్సు కోసం దువా చేశారు. జామే మస్జిద్ లో మత గురువులు మౌలానా నౌమాన్ హష్మి , మౌలానా ఇర్ఫాన్ రజా, మౌలానా అక్మల్ రజా, అల్లాహ్ సందేశాలను, ఖురాన్ లోని సూక్తులను వివరించారు. ప్రత్యేక నమాజు చదివించినారు. అనంతరం మౌలానా నౌమాన్ హష్మీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (స) సతీమణి హజ్రత్ అయిషా ఒకసారి అర్ధరాత్రి నిద్రలేచి చూసేసరికి మొహమ్మద్ ప్రవక్త కనిపించలేదు. ఆమె వెతుక్కుంటూ బయటికి వెళ్లింది. జన్నతుల్ బఖీ అనే ఖనన వాటికలో సమాధుల మధ్య (ప్రవక్త (స) కనిపించారు. హుటాహుటిన ఆయన దగ్గరికి వెళ్లింది. భార్యను చూసిన ప్రవక్త (స) 'అయిషా! నన్నే అనుమానిస్తున్నావా? అల్లాహ్ మన్నింపు, కారుణ్యం కురిసే చేయి ఇది, అందుకే ఈ సమాధుల్లో శాశ్వతంగా నిద్రిస్తున్న వారి మన్నింపు కోసం అల్లాహ్ ను వేడుకుంటున్నాను' అని తన సతీమణికి వివరణ ఇచ్చారు. ముహమ్మద్ ప్రవక్త (స).షాబాన్ నెల 15వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఇస్లామియ చరిత్రలో నిలిచిపోయింది. రంజాన్ నెలకు 15 రోజుల ముందు జరిగిన ఈ ఘటనను "షబే బరాత్"గా జరుపుకొంటారు అని చెప్పారు. మంగళవారం రాత్రంతా ముస్లింలు జాగారం చేస్తూ మసీదుల్లో నమాజులు ఆచరించారు. షాబాన్ మాసంలో మృతి చెందిన తమ పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి యొక్క సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ పూర్వీకుల సమాధులను సందర్శించినారు. వారి మగ్ఫిరత్ (మన్నింపు)కోసం దువా చేసినారు. దువా అంటే వేడుకోలు షాబాన్ నెల తొలి పదిహేను రోజులు ప్రవక్త (స) ఉపవాసాలు పాటించి రమజాన్ కు సంసిద్ధులయ్యే వారు. శుభాలు సమృద్ధిగా వర్షించే షాబాన్ నెలలో నిర్లక్ష్యానికి తావివ్వకుండ రంజాన్ నెలను స్వాగతించే విధంగా ఎవరికి వారు సన్నద్ధం కావాలి. వీలైనన్ని ఎక్కువ ప్రార్థనలు చేసి దైవ సాన్నిధ్యాన్ని పొందాలి' అంటారు అబ్దుల్ ఖాదిర్ జిలాని రహ్మతుల్లా అలైహ్. సమాధులను సందర్శించడం వల్ల కనువిప్పు కలుగుతుందని ఉలేమాలు షబే బరాత్ సందేశాన్ని వివరించినారు. ఖబరస్తాన్ (ఖనన వాటిక)లో ప్రవేశించేటప్పుడు అస్సలాము అలైకుం 'యా ఆహలల్ ఖుబూర్' అని చెబుతూ లోనికి ప్రవేశించారు. 'సమాదుల్లో నిద్రిస్తున్న మీపై శాంతి శుభాలు కురియుగాక అన్నది దాని అర్థం.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సౌకర్యాలు పెంచాలి



హైదరాబాద్ : ఎంతో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కు అనుగుణంగా సౌకర్యాలను పెంచాల్సిన అవసరం ఉందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వెనుక 4.21 కోట్ల రూపాయల వ్యయంతో జీ ప్లస్ త్రీ పద్దతిలో చేపట్టిన కిచెన్, డైనింగ్ హాల్ భవన నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా ఎల్లమ్మ అమ్మవారి ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భవన నిర్మాణ పనుల గురించి అధికారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు వివరించారు. గ్రౌండ్ లో వాహనాల పార్కింగ్, మొదటి అంతస్తులో కిచెన్, రెండు, మూడు ఫ్లోర్ లలో డైనింగ్ హాల్ ఏర్పాటు చేసేలా భవనం డిజైన్ చేసినట్లు అధికారులు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 2014 లో తాను ఎమ్మెల్యే గా వచ్చిన తర్వాత నే. అమ్మవారి ఆలయం వద్ద అనేక అభివృద్ధి పనులు చేపట్టడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడం జరిగిందని ఆయన వివరించారు. గతంలో అమ్మవారి కళ్యాణం ఆలయం లోపల పరిమితి సంఖ్య కలిగిన భక్తుల సమక్షంలో జరిగేదని, తాను ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత ఆలయం ముందు, పక్కన భారీ రేకుల షెడ్డులను నిర్మించడం జరిగిందని చెప్పారు. ఆలయం బయట కళ్యాణం నిర్వహిస్తున్న నాటి నుండి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. దాదాపు 7 నుండి 8 లక్షల మంది వరకు భక్తులు అమ్మవారి కళ్యాణానికి వస్తున్నారని అన్నారు. ఆలయం వద్ద రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టడం, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య, ఆలయ ఆదాయం కూడా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఆదివారం, మంగళవారం, శుక్రవారం రోజులలో 30 వేల మంది వరకు భక్తులు వచ్చే వారని, ప్రస్తుతం లక్ష మంది వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారని తెలిపారు. ఆలయం వద్ద వివిధ రకాల పూజా సామగ్రి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారికోసం బోనం కాంప్లెక్స్ వద్ద షాపులను దాతల సహకారంతో నిర్మించి ఉచితంగా కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆలయం సమీపంలో మల్టి లెవెల్ పార్కింగ్ భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని చెప్పారు. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయకపోవడం తో పనులు నిలిచిపోయాయని అన్నారు.ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఇఒ శంకర్, హైమావతి, అమీర్ పేట సర్కిల్ ఆఅ సుజాత, ఆఇ మహేష్, టూరిజం ఆఇ హన్మంత రెడ్డి, ఎలెక్ట్రికల్ ఆఇ సుధీర్, శానిటేషన్ ఆఇ వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, పీయూష్ గుప్తా, వనం శ్రీనివాస్, కుమార్, సీనియర్ సిటీజన్స్ పార్థసారధి, రాజేష్ ముదిరాజ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, వేణుగౌడ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తుపై కీలక ప్రశ్నలు

### - కేంద్ర ప్రభుత్వంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు

పెద్దపల్లి : ఇరోజు దేశం ముందుకు ఒక అత్యంత కీలకమైన ప్రశ్న సూటిగా నిలుస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. నరేంద్ర మోదీ భారతదేశాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారా? లేక వాషింగ్టన్ డీసీ నుంచి ట్రంప్ నడిపిస్తున్నారా? అనే సందేహం ప్రజల మనసుల్లో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.ఇది సాధారణ రాజకీయ అంశం కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన విషయం అని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు భయంతో, విదేశీ ఒత్తిళ్లకు లోంగిపోయినట్టు పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలు దేశం ముందు ఉన్న నిజాలను బయటపెడుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు కొనసాగిన ద్వంద్వ వైఖరిని తొలగించి, కేంద్ర ప్రభుత్వ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. మోదీ ఎక్స్పోజ్ అయ్యారని, నిజం ఇప్పుడు దేశ ప్రజల ముందుకు వచ్చేసిందని తెలిపారు.ఈ నిర్ణయాల భారం నేరుగా భారతదేశ ప్రజలపై పడుతోందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ హెచ్చరించారు. ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకుంటున్న రష్యన్ ఆయిల్ సుమారు 40 శాతం వరకు ఉండగా, ట్రంప్ ఒత్తిడి వల్ల ఆ దిగుమతులను 20 శాతానికి తగ్గించాలని చెప్పడం వల్ల దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయల వరకు నష్టం సంభవించే ప్రమాదం ఉందని వివరించారు.అలాగే, కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసిన "మేక్ ఇన్ ఇండియా" విధానాన్ని పక్కన పెట్టి, అమెరికా ఉత్పత్తులపై ఉన్న టారిఫ్లను పూర్తిగా తొలగించడం ద్వారా దేశీయ పరిశ్రమలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల మొత్తం మీద రెండు లక్షల నుంచి మూడు లక్షల కోట్ల రూపాయల వరకు భారత ఆర్థిక వ్యవస్థకు నష్టం కలగనున్నట్లు అంచనా వేశారు.ఈ కీలక అంశాలపై బీజేపీ నేతలు సమాధానం చెప్పే ధైర్యం లేకుండా, వాస్తవాల నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించారు. లోకసభలో రాహుల్ గాంధీ గారు ఈ ప్రశ్నలను సూటిగా అడుగుతుంటే, అధికార పక్షం స్పందించలేక ఇబ్బంది పడుతోందని తెలిపారు.చివరగా, దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం కొనసాగుతుందని వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## తాడేపల్లిగూడెం పట్టణంలో దారుణం

### ప్రియురాలిపై ప్రియుడి కుటుంబం దాడి..మృతి

తాడేపల్లిగూడెం : ప్రేమించిన యువతిని బండారు సురేష్ అనే యువకుడు నమ్మించి మోసం చేసాడు. కైకలూరు లోకుముడి గరువు గ్రామానికి చెందిన వసంత, తాడేపల్లిగూడెంకు చెందిన బండారు సురేష్ కు మధ్య ప్రేమ వ్యవహారంనడిచింది. విజయవాడ ఒక ప్రైవేట్ యూనివర్సిటీలో బీటెక్ వసంత, సురేష్ చదివారు. సురేష్ చెడు వ్యసనాలకు బానిసై చదువు మధ్యలోనే ఆపేసినట్లు సమాచారం. ప్రేమించిన సురేష్ కి రూ.లక్ష నగదు వసంత ఇచ్చింది. డబ్బుల కోసం సురేష్ ఇంటికి తాడేపల్లిగూడెం ఆదివారం వచ్చిన వసంతపై సురేష్ కుటుంబ సభ్యులు దాడి చేసారు. తాడేపల్లిగూడెం ప్రైవేట్ హాస్పటల్ లో చికిత్స పొందుతూ తమ్మిరెడ్డి వసంత (22) మృతి చెందింది. టీబీ టాబ్లెట్స్ ఇచ్చి తమ కుమార్తెను చంపేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## 2026- 27 ఆర్థిక బడ్జెట్ పై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కసరత్తు

అమరావతి : రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 ఆర్థిక బడ్జెట్ పై కసరత్తు ప్రారంభించారు. ఆర్థిక మంత్రితో మంత్రులు, సంబంధిత శాఖ అధికారులు వరుసగా సమావేశం అవుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు తోపాటు ఆ శాఖ అధికారులతో ఆర్థిక మంత్రి సమావేశమయ్యారు. తరువాత హోమ్ శాఖ మరియు డిజాస్టర్ మేనేజ్మెంట్ మంత్రిగా ఉన్న వంగలపూడి అనితతో పాటు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మిగిలిన శాఖలకు సంబంధించిన మంత్రులు మరియు సంబంధిత అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ లో తమ శాఖకు కావలసిన బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలు ఆర్థిక శాఖ కు వివిధ శాఖలు అందించాయి.

## సీవరేజ్ పనుల ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్:మోండా డివిజన్ వెస్ట్ మారేడ్పల్లిలోని నెహ్రూనగర్లో హెచ్ఎండబ్ల్యూఎస్విభాగం 10 లక్షల రూపాయల విలువైన నిధులతో చేపట్టనున్న సీవరేజ్ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, హెచ్ఎండబ్ల్యూఎస్అధికారులతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు వినోద్,స్రవంతి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేష్ యాదవ్, నాయకులు సంతోష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, వైష్ణవి యాదవ్, శేఖర్ ముదిరాజ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై అవగాహన తీసుకురావాలి

సికింద్రాబాద్ : కిమ్స్ హాస్పిటల్ లో జరిగిన క్యాన్సర్ అవేర్ నెస్ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దు. మన శరీరం మనకు ఎప్పటికప్పుడు మార్పులను సూచిస్తుంది. శరీరంలో వస్తున్న మార్పులను గ్రహించి వెంటనే వైద్యులను సంప్రదించాలి. క్యాన్సర్ పైన ప్రజల్లో అవగాహన తీసుకు రావడం కోసం ఒక ఉద్యమం రావాలి. ఒక దీక్షలాగా మనందరం కలసి ముందుకు సాగాలి. ఈ ఉద్యమంలో నేను కూడా ఒక రేణువవుతా. అవేర్ నెస్ కార్యక్రమంలో ముందు వరుసలో ఉంటాను. ఎవరైనా షార్ట్ ఫిల్మ్ లు చేస్తే నటించడానికి సిద్ధమని అన్నారు.

## ఇంట్లో అగ్నిప్రమాదం

హైదరాబాద్ : చాదర్ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉస్మాన్పురా లో ఒక ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఇంటి ఆవరణలో బహిరంగ ప్రదేశంలో నిల్వ ఉంచిన పాత చెక్క తుక్కు దగ్ధం అయింది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సకాలంలో మంటలను అదుపులోకి తీసుకువచ్కారు. మంటలు మరింత వ్యాప్తి చెందకుండా నియంత్రించారు.

## కొత్తగూడెంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

కొత్తగూడెం : కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ గా అవతరించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారని,అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని, ఇంతకుముందు కూడా ఈ మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ తమ పార్టీకి చెందినవారేనని చెప్పారు.ఎంపీ రవిచంద్ర తనను కలిసిన ఒక టీవీ ఛానెల్ ప్రతినిధితో మాట్లాడుతూ, ధర్మం-అధర్మానికి జరుగుతున్న పోరులో తప్పకుండా ధర్మమే గెలుస్తుందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చనందున బడుగు బలహీన వర్గాల వారంతా కాంగ్రెస్ పాలకులపై మండిపడుతున్నారన్నారు.వృద్ధులు,దివ్యాంగుల పింఛన్లు పెంచలేదని,రైతుబంధు సక్రమంగా ఇవ్వట్లేదని, నిరుద్యోగ యువతకు,కౌలు రైతులకు చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కారని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.మాజీ మంత్రి హరీష్ రావు బొగ్గు కుంభకోణాన్ని వెలికి తీయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు దిగి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు,ఆయన కుటుంబ సభ్యులకు వరుసగా నోటీసులిచ్చి "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ సర్కార్ పనితీరును చూసి తాము నష్టపోయ్యిందేమిటో ప్రజలు బాగా అర్థం చేసుకోవడం జరిగిందనిఎంపీ రవిచంద్ర వివరించారు.కొత్తగూడెంతో పాటు ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతున్నదని,అన్ని చోట్లా కూడా గులాబీ జెండా రెపరెపలాడడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

## శ్రీవారి వైద్య సేవకులకు సౌకర్యాలపై చర్యలు

తిరుపతి : టిటిడిలో త్వరలో ప్రారంభించనున్న శ్రీవారి వైద్య సేవకులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై చర్యలు చేపట్టినట్లు టిటిడి జేఈవో డా. ఎ. శరత్ వెల్లడించారు. ఎస్వీ ఆయుర్వేద వైద్యశాల, స్విమ్స్, ఎస్వీ వేదిక్ యూనివర్శిటీలోని అవసరమైన భవనాల నవీకరణలో భాగంగా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు టిటిడిలో శ్రీవారి వైద్య సేవకు అవసరమైన వైద్య రంగంలోని వివిధ విభాగాల నిపుణులకు అవసరమైన వసతి సౌకర్యం కల్పించేందుకు వీలుగా ఎస్వీ ఆయుర్వేద వైద్యశాల, స్విమ్స్, ఎస్వీ వేదిక్ యూనివర్శిటీలోని వసతి గదులను పరిశీలించామన్నారు. సంబంధిత వైద్యులు వైద్య సేవ చేసేందుకు వీలుగా వారం రోజుల పాటు బస చేసేందుకు వసతి గదుల నవీకరణ, మౌళిక సౌకర్యాలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.తిరుపతి, తిరుమలలో ఉన్న టీటీడీ ఆస్పత్రుల్లో ముఖ్యంగా అశ్వినీ ఆసుపత్రి, ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్న పిల్లల ఆసుపత్రుల్లో రోగులకు సేవ చేసేందుకు శ్రీవారి వైద్య సేవను త్వరలోనే ప్రారంభించేందుకు వీలుగా చర్యలు చేపట్టామన్నారు. వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాల వైద్య నిపుణులు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని జేఈవో తెలిపారు. ఇప్పటికే టిటిడిలోని వివిధ విభాగాలలో శ్రీవారి సేవకులు వారం రోజులకు గాను 4 వేల మంది శ్రీవారి సేవకులు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని, దాదాపు 17 లక్షలకు పైగా శ్రీవారి సేవకులు సేవలు అందించారన్నారు. శ్రీవారి సేవను వైద్య, విద్య, ఐటీ రంగాలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

## బీజేపీ కి రాజీనామా చేసిన జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు గోరేపల్లి సుదర్శన్ గౌడ్ పార్టీకి రాజీనామా చేసారు. పార్టీ తనకు అన్యాయం చేసిందంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. గతంలో తాండూర్ పట్టణ అధ్యక్షునిగా సుదర్శన్ గౌడ్ కొనసాగారు. పట్టణంలోని 28వ వార్డు నుంచి తన భార్యను కౌన్సిలర్ గా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసారు, పార్టీ బీఫామ్ ఇవ్వకపోవడంతో పార్టీకి రాజీనామా చేసారు. అదే వార్డు నుంచి తాండూర్ పట్టణ అధ్యక్షుడైన నాగారం మల్లేశంకు టికెట్ కేటాయించారు. నగరం మల్లేశం కోట్ పల్లి మండలం కొత్తపల్లిలో సర్పంచ్. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని అతనికి పార్టీ బి ఫామ్ ఇవ్వడంపై సుదర్శన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఒక దగ్గర ఓటు హక్కు వినియోగించుకొని మరో దగ్గర పోటీ చేయడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో జరిగే పరిణామాలపై రాష్ట్రస్థాయి నేతలు దృష్టి పెట్టాలి. పార్టీకి ఎంతోకాలంగా సేవ చేశా.. పార్టీ తనకు అన్యాయం చేసిందంటూ ఆవేదన చెందారు.

# వైసీపీకి వరుస షాకులు

నెల్లూరు : ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి.తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు.మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

**ప్లాన్ వర్కౌటవుతుందా...** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంమయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు.మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు.ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

# మళ్లీ...బూతులతో రాజకీయాలు

గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల విజయం తర్వాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన సమయంలో.. వీధుల వెంట జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు రాష్ట్ర భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌ల చుట్టూ తిరుగుతున్న తాజా పరిణామాలు ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తున్నాయి.నిన్న అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాల్సింది పోయి, బూతులతో కూడిన విమర్శలు చేయడం ఖచ్చితంగా గర్హనీయం. దీనిపై టీడీపీ శ్రేణులు భగ్గుమనడం సహజమే అయినప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆయన ఇంటిపై దాడి చేయడం సమర్థనీయం కాదు. పోలీసులు రంగప్రవేశం చేసి అంబటిని అరెస్ట్ చేయడంతో ఆ వివాదం ముగిసిందనుకున్న తరుణంలో, నేడు మరో కొత్త మంట రాజుకుంది.మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ చేసిన విమర్శలను సాకుగా చూపి టీడీపీ శ్రేణులు ఆయన ఇంటికి నిప్పు పెట్టడం అత్యంత దారుణమైన విషయం. అంబటి చేసిన వ్యక్తిగత దూషణలతో పోలిస్తే, జోగి రమేశ్ చేసినవి రాజకీయ విమర్శలుగానే పరిగణించవచ్చు. కానీ, చిన్న విమర్శను కూడా సహించలేక ఇళ్లకు నిప్పు పెట్టే స్థాయికి రాజకీయాలు దిగజారడం ఆందోళనకరం. "వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలపై విసుగు చెందే ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. మళ్లీ అదే పద్ధతులను టీడీపీ కేడర్ అనుసరిస్తే.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముంటుంది?" అనే ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజల నుంచి వినిపిస్తోంది.ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవజ్ఞుడు, సంయమనం పాటించే వ్యక్తి. ఆయన ఎప్పుడూ అభివృద్ధి, వ్యవస్థల ప్రక్షాళన గురించి మాట్లాడుతుంటారు. అయితే, పార్టీ కేడర్ మాత్రం నాయకుడి మౌనాన్ని 'చేతగానితనం'గా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. "మాపై దాడులు జరిగినప్పుడు మేం భరించాం, ఇప్పుడు మా టైమ్ వచ్చింది" అనే పగతో రగిలిపోతున్న కేడర్, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పితే, పెట్టుబడులు రావు సరి కదా.. ఉన్న కంపెనీలు కూడా తరలిపోయే ప్రమాదం ఉంది. కేడర్ చేసే ఇటువంటి పనులు చివరకు ప్రభుత్వంపైనే మచ్చ తెస్తాయి.ఇది కేవలం ఒక పార్టీ కార్యకర్తల ఉద్రేకం మాత్రమే కాదు, రాష్ట్ర ప్రతిష్టకు సంబంధించిన అంశం. ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, అరాచకాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని కఠిన సందేశం పంపాలి. గత ప్రభుత్వ అవినీతిపై లేదా దాడులపై విచారణ జరిపి, చట్టబద్ధంగా శిక్షించాలే తప్ప వీధి పోరాటాలు పరిష్కారం కావు. ప్రతిపక్షాలు కూడా నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. బూతు పురాణాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వల్ల నష్టపోయేది వారే అని గ్రహించాలి.ప్రజలు మార్పును కోరుకుని ఓటేశారు. ఆ మార్పు అభివృద్ధిలో, పరిపాలనలో కనిపించాలే తప్ప దాడులలో కాదు. రాష్ట్రం వల్లకాడు కాకుండా ఉండాలంటే, ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని అరాచక శక్తులపై మోపాలి. అది ప్రతిపక్షమైనా, స్వపక్షమైనా సరే! శాంతియుత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు పాలకుల భుజస్కంధాలపై ఉంది.

# కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి?

విజయవాడ: లేబర్ కొడ్ లు అమలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలధీయాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా సదస్సులు పలు కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ సందర్బంగా జరిగిన సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్ రావు మాట్లాడుతూ ఏ నూతన చట్టాలను తెచ్చిన మోడీ ప్రభుత్వానికి అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ విధానాలకు ఫుల్ స్టాఫ్ పెట్టాలంటే కార్మిక వర్గం 4 లేబర్ కొడ్స్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయటం తప్ప మరో మార్గం లేదన్నారు. మేజార్టీ కార్మిక వర్గం వ్యతిరేకించిన, తమ అనుకూల కొంతమంది మేధావులతో కలిసి నీతిఆయోగ్ లో నిర్ణయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ లకు అనుకూలంగా చట్టాలు తెస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. వ్యవసాయన్ని నష్టపరిచి, కార్పొరేట్లను పెంచాలనేది కేంద్ర నిర్ణయమన్నారు. శ్రమ చేసేవారిని చిన్నచూపు చూడటం బిజెపికే చెల్లిందన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మూలి సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి అనుగుణంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం వ్యవహరించటం సిగ్గు చేటన్నారు. పోరాడి సాధించుకున్నా 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 10 గంటల పని చేయాలని జీఓ తేవాటం సిగ్గు చేటన్నారు. గత సిఎంల గతే చంద్రబాబుకు పట్టిందని హేద్దవ చేశారు. ఏఐసిసిటియు రాష్ట్ర కార్యదర్శి ఆరేపల్లి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ 4 లేబర్ కొడ్స్ వలన సమ్మె చేసే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు పోతున్నాయన్నారు. ఏఐయుటియుసి రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా పోయిందన్నారు. ఐఎఫ్ టియు రాష్ట్ర అధ్యక్షులు కె. పోలారి మాట్లాడుతూ బ్రిటిష్ కాలంకు ముందే కార్మికుల పోరాట ఫలితంగా వచ్చిన కార్మిక చట్టాలు, హక్కులను ఎడిఏ ఆధినంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసి, 4 లేబర్ కొడ్స్ తేవాటం, వాటిని అమలు చేయాలని చూడటాన్ని 12 సమ్మెతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. రామకృష్ణ మాట్లాడుతూ సోషల్ మీడియాలో లేబర్ కొడ్స్ వలన కార్మికులకు లాభధాయకమనే ప్రచారాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఏఐసిటియు రాష్ట్ర నాయకులు గోల్లపూడి ప్రసాద్ మాట్లాడుతూ బిహార్ ఎన్నికల తరువాత బిజెపి నూతన చట్టాలను తీసుకురావటంలో తలమునకలైందని విమర్శించారు. టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు మాట్లాడుతూ నగరంలో లేబర్ కొడ్స్ లను వ్యతిరేకిస్తూ కలిసి వచ్చే శక్తులను కలుపుకుని పెద్ద ఎత్తున గతంకంటే ఎక్కువగా పోరాడాలన్నారు.

ముందుగా నగరంలో రెండు రోజుల పాటు కార్మిక వాడాల్లో, ప్రధాన సెంటర్లో రెండు రోజుల పాటు ఆటోజాతలుంటాయన్నారు.

12 న వన్ టౌన్ రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్ వరకు ప్రదర్శన, అనంతరం సభ జరుగుతుందని చెప్పి, సదస్సును ముగించటం జరిగింది. సదస్సుకు ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కెఆర్ ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి కె. దుర్గారావు అధ్యక్షత వహించి, వక్తలను ఒక్కొక్కరిని పిలిచారు. తొలుత సిఐటియు జిల్లా నాయకులు నారాయణ వక్తలను వేదికపై ఆహ్వానించారు. వేదికపై ఐఎఫ్ టియు జిల్లా నాయకులు కృష్ణరెడ్డి కూడా ఉన్నారు. అధిక సంఖ్యలో సదస్సుకు కార్మికులు పాల్గొన్నారు.

# కాపు సామాజికవర్గం కోసం..

ఏలూరు : 2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు.చరిత్రను చూస్తే కాంగ్రెస్? టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది.ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు.ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలోకూడా పుకార్లు వినిపిస్తున్నాయి.గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

# మరో వివాదంలో మంచు ఫ్యామిలీ

తిరుపతి : మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణుగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది.అయితే రీసెంట్ విద్యార్థి సంఘాలు కూడా మోహబ్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు.విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న ఆఈఎ సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# ఆ మూడు సీట్లు దక్కేదెలా?

విజయవాడ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు.

అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

# ఏపీ చరిత్రలో సరికొత్త అధ్యాయం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది.. చంద్రబాబు కలల ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలక ముందడుగు పడబోతోంది. ఈ నెల 6న అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ దిశగా మరో కీలక ముందడుగు పడింది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించిన భూమిపూజకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందేమరోవైపు అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ పేరుతో ఓ యూనివర్శిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఐటీశాఖ ప్రతిపాదనపై ఇవాళ జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తారు. ఈ వర్శిటీలో స్కూల్ విద్యార్థుల నుంచి పీజీ వరకు ఏఐలో విద్యా బోధన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రానుండటంతో ఈ వర్శిటీ అనుబంధంగా ఉంటుందని చెబుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఓ గేమ్ ఛేంజర్ అంటోంది ప్రభుత్వం. ఇటీవల 14మంది ప్రముఖ నిపుణులతో రెండు కమిటీలను కూడా నియమించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో మరిన్న కంపెనీలను ఆకర్షించాలని భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు రావడం ఖాయం అంటున్నారు.ప్రపంచవ్యాప్తంగా అందరూ క్వాంటమ్ టెక్నాలజీపై ఫోకస్ పెట్టారని చంద్రబాబు చెబుతున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారబోతోందన్నారు. ఏకంగా లక్ష మంది నిపుణుల తయారీ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పటికే క్వాంటమ్ శిక్షణకు సంబంధించి 50వేలమంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో క్వాంటమ్ టెక్నాలజీపై మరింత ఫోకస్ పెడతామన్నారు. ఒకవేళ ఎవరైనా క్వాంటం టెక్నాలజీ ద్వారా నోబుల్ ప్రైజ్ దక్కించుకుంటే వారికి రూ.100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాదు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. అభివృద్ధి, స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# ఇక బెంగళూరు ఆరుగంటలే..

కర్నూలు : ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబా టులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుం దని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు.ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు) 22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. బైపాస్‌లు అందుబాటులోకి వస్తే నంద్యాల నుంచి నొస్సం గంటలోపే వెళ్లొచ్చు.ఈ హైవే పూర్తిచేస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు బెంగళూరుతో కనెక్టివిటీ పెరుగుతుంది. ఎందుకంటే రెండు జిల్లాల నుంచి బెంగళూరుకు వెళ్లేవారిలో.. ఐటీ ఉద్యోగులు, ఉపాధి కోసం వెళ్లేవారు, వ్యాపారులు ఉంటారు. వారందరికి ప్రయాణ సమయం తగ్గుతుంది. గతంలో బెంగళూరు వెళ్లాలంటే అవుకు, కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి, అనంతపురం మీదుగా వెళ్లేవారు. అదే 167కే జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే.. జమ్మలమడుగు, ముద్దనూరు మీదుగా తాడిపత్రి హైవేలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా బెంగళూరుకు త్వరగా వెళతారు. అలాగే ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిది కూడా కర్నూలు జిల్లా కావడంతో ఆయన కూడా ఈ హైవే పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మొత్తం మీద బెంగళూరు వెళ్లేవారికి కీలకమైన హైవే పనులు ఊపందుకున్నాయి.

# సినిమా

## వారణాసి రన్‌టైమ్.. పార్ట్ 2లపై జక్కన్న క్లియర్ క్లారిటీ



ఇండియన్ సినిమా రేంజ్‌ను వరల్డ్ లెవల్‌కు తీసుకెళ్లిన రాజమౌళి, ఇప్పుడు మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' కోసం ప్రతి చిన్న విషయాన్ని చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్ అయినప్పటి నుండి ఇది రెండు భాగాలుగా వస్తుందని సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. బాహుబలి, పుష్ప వంటి సినిమాలు రెండు భాగాలుగా వచ్చి హిట్టవ్వడంతో వారణాసి కూడా అదే బాటలో సాగుతుందని అంతా అనుకున్నారు. అయితే ఈ విషయంలో రాజమౌళి లేటెస్ట్ గా ఒక హాలీవుడ్ ఇంటర్వ్యూలో ఇచ్చిన క్లారిటీ ఇప్పుడు వైరల్ అవుతోంది. సినిమా నిడివిపై వచ్చిన సందేహాలను జక్కన్న చాలా సింపుల్ గా క్లారిటీ ఇచ్చేశారు. ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. ఈ సినిమా రన్‌టైమ్ సుమారు మూడు గంటల వరకు ఉంటుందని ఆయన కన్ఫర్మ్ చేశారు. మొదట్లో ఈ కథను రెండు భాగాలుగా చేయాలనే ఆలోచన కొంత ఉన్నప్పటికీ, ఆ తర్వాత దాన్ని వెంటనే డ్రాప్ చేశామని చెప్పారు. అంటే ఇప్పుడు మనం చూడబోయే వారణాసి కేవలం ఒకే ఒక్క పార్ట్ లో వచ్చే భారీ అడ్వెంచర్ మూవీ అన్నమాట.? నిజానికి మూడు గంటల సినిమా అంటే ఆడియన్స్‌ను అంతసేపు కూర్చోబెట్టడం ఒక పెద్ద సవాల్ అని ఇంటర్వ్యూయర్ అడిగారు. దానికి జక్కన్న తనదైన స్టైల్లో సమాధానమిస్తూ.. కథలోని దమ్ము మీద తనకు పూర్తి నమ్మకం ఉందని హింట్ ఇచ్చారు. ఆర్ఆర్ఆర్ తర్వాత వస్తున్న సినిమా కావడంతో వరల్డ్ ఆడియన్స్ అటెన్షన్ గ్రాబ్ చేయడానికి ఈ మూడు గంటల నిడివి కరెక్ట్ అని రాజమౌళి ఫిక్స్ అయ్యారు. కథను సాగదీయకుండా పక్కాగా ఒకే ఫిల్మ్ గా చూపించబోతున్నారట. వారణాసి సినిమా అంటార్కిటికా మంచు కొండల నుండి ఆఫ్రికా అడవుల వరకు సాగే ఒక గ్లోబల్ జర్నీ. పైగా రామాయణం కాలం వరకు వెళ్లే టైమ్ ట్రావెల్. ఇంత పెద్ద స్పాన్ ఉన్న కథను కేవలం ఒకే పార్ట్ లో కుదించడం అంటే అది మామూలు విషయం కాదు. పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్స్ విలన్ రోల్స్ లో కనిపిస్తుండటంతో, హీరో విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్ సినిమాను చాలా వేగంగా నడిపిస్తుందని తెలుస్తోంది. గ్రాఫిక్స్ కోసం ఒక్కో ఫ్రేమ్‌కు 20 గంటల సమయం కేటాయించడం చూస్తుంటే క్వాలిటీ విషయంలో జక్కన్న ఎంత పట్టుదలతో ఉన్నారో అర్థమవుతోంది. ఐమాక్స్ స్క్రీన్ పై మూడు గంటల పాటు చూడటం అంటే అభిమానులకు ఇది ఒక విజువల్ ఫీస్ట్ లాంటిదని చెప్పవచ్చు. కథను రెండు ముక్కలు చేసి సస్పెన్స్ పెట్టకుండా, ఒకేసారి కంప్లీట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే రాజమౌళి నిర్ణయం సాహసోపేతమైనదే అయినా పక్కాగా ఉంది. 2027 ఏప్రిల్ 7న ఈ భారీ చిత్రం వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా విడుదల కానుంది. ఏదేమైనా 'వారణాసి' పార్ట్ 2 ఉండదు అనే క్లారిటీ రావడంతో ఫ్యాన్స్ ఒక రకమైన ఊరట చెందుతున్నారు. గంటల కొద్దీ నిడివి ఉన్నా సరే రాజమౌళి మార్క్ ఎమోషన్ ఉంటే ఆడియన్స్ కచ్చితంగా కనెక్ట్ అవుతారని చెప్పవచ్చు.

## జక్కన్నకు పీసీ చేసిన రిక్వెస్ట్ ఏంటీ?



రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీ వారణాసి. సూపర్‌స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా నటిస్తుండగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తోంది. తను ఏడేళ్ల విరామం తరువాత చేస్తున్న ఇండియన్ మూవీ ఇదే కావడం విశేషం. తనకు గ్లోబల్ స్టార్‌గా ఉన్న ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకుని జక్కన్న ఈ సినిమాకు తీసుకున్నాడనే వార్తలు షికారు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ట్రావెలర్‌గా, శ్రీరాముడిగా మహేష్ రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించి ఆశ్చర్యపరచబోతున్నాడు. ఇదిలా ఉంటే ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరవ్వడానికి ముందు ప్రియాంక చోప్రా దర్శకుడు రాజమౌళిని రిక్వెస్ట్ చేసిందట. దానికి ఒప్పుకోమని కోరిందట. కొలైడర్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రియాంక వారణాసి ప్రాజెక్ట్ అంగీకరించడానికి ముందు జరిగిన పలు ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. ప్రస్తుతం ఈ ఇంటర్వ్యూ నెట్టింట వైరల్‌గా మారి మహేష్ అభిమానుల్ని ఆకట్టుకుంటోంది. ఈ మూవీ కోసం రాజమౌళి ఫోన్ చేసినప్పుడు ప్రియాంక మాట్లాడుతూ నేను దాదాపుగా ఆరేళ్లుగా భారతీయ సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్నాను. రాజమౌళి నాకు ఫోన్ చేసి మా సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ చాలా బాగుంటుంది మీరు చేయాలి అన్నారు. అప్పుడు నేను నాకు ఒకే ఒక అభ్యర్థన ఉంది. మీరు నాతో డ్యాన్స్ చేయిస్తారా దయచేసి ఎందుకంటే నేను చాలా కాలంగా డ్యాన్స్ చేయలేదు- అని అడిగాను. అయ్యో నేను ఆయనను అలా అడిగి ఉండాల్సింది. ఎందుకంటే మేము ఇప్పుడు సినిమా కోసం చాలా డ్యాన్స్ చేస్తున్నాం. పాపం మహేష్..ఇదంతా నీ వల్లే..నీవల్లే నేను కూడా చేయాల్సి వస్తోంది అంటున్నాడు అని తెలిపింది. అంటే ప్రియాంక చోప్రా కారణంగా ఇప్పుడు మహేష్ కూడా జక్కన్నకు బుక్ అయ్యాడన్నమాట.







## రెడ్ డ్రెస్ హీట్ పెంచిన రుక్మిణీ వసంత్!


ఒకవైపు సినిమాలలో తమ నటనతో ఆకట్టుకుంటూనే మరొకవైపు సోషల్ మీడియా వేదికగా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను మెప్పించే దిశగా అడుగులు వేస్తున్నారు కొంతమంది హీరోయిన్స్. అందులో భాగంగానే ఇప్పుడు సరికొత్త అవుట్ ఫిట్స్ తో ప్రేక్షకుల ముందుకు రావడమే కాకుండా ఆ దుస్తులలో తమ అందాన్ని రెట్టింపు చేసుకుంటున్నారు అనడంలో సందేహం లేదు. అలాంటి వారిలో యంగ్ బ్యూటీ రుక్మిణి వసంత్ కూడా ఒకరు. తన అందంతో, నటనతో, హుందాతనంతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె ఇటీవల వచ్చిన కాంతార 2 చిత్రంలో నటించి తన నటనతో యావత్ పాన్ ఇండియా రేంజిలో పాపులారిటీ దక్కించుకుంది. ఇందులోని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టిను కూడా తన నటనతో డామినేట్ చేసి ప్రేక్షకులను మెప్పించిన ఈమె.. ప్రస్తుతం ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ అనే సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కి బ్రేక్ పడిన విషయం తెలిసిందే. మరికొన్ని చిత్రాలలో బిజీగా ఉన్న రుక్మిణి వసంత్ మరోవైపు ఆడియన్స్ ను ఆకట్టుకోవడానికి ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది. అందులో రెడ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె కుర్చీలో కూర్చొని హుందాగా తన అందాన్ని ఎక్స్పోజ్ చేసింది.. చూపరులకు కనువిందుగా ఉన్న ఈమె అందాన్ని చూసి అభిమానులు కవిత్వాలు వల్లుతున్నారు. ఈమె చూపులు మరింత ప్రకాశవంతంగా అనిపిస్తున్నాయి. తన అవుట్ ఫిట్ తో అభిమానులను మెస్మరైజ్ చేసింది రుక్మిణి వసంత్.

## హిట్ మెషీన్ ఫోన్ చేస్తే గూగుల్ చేసిందంట!




వరుస బ్లాక్ బస్టర్ హిట్‌లతో టాలీవుడ్‌లో దర్శకుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్నారు అనిల్ రావిపూడి. సక్సెస్‌కు మారుపేరుగా నిలిచిన ఆయన ఇప్పుడు టాలీవుడ్‌లో హిట్‌మెషీన్. టాప్ స్టార్లతో చెప్పి మరీ బ్లాక్ బస్టర్ హిట్‌లు అందించి సరికొత్త రికార్డుని సొంతం చేసుకున్నారు. గత ఏడాది విక్టరీ వెంకటేష్‌తో -సంక్రాంతికి వస్తున్నాం- అంటూ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాతో ప్రేక్షకుల్ని అలరించడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించారు. గత ఏడాది సంక్రాంతి బరిలో నిలిచిన ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా ఊహించని విధంగా రూ.300 కోట్ల పైచిలుకు వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురి చేసింది ఇక ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన -మన శంకరవరప్రసాద్‌గారు- కూడా అదే మ్యాజిక్‌ని రిపీట్ చేసి మెగాస్టార్‌కు బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించింది. వింటేజ్ చిరుని పరిచయం చేసిన తీరు, ఫ్యామిలీ ఎమోషన్స్, అంతే మోతాదులో కామెడీని పండించిన తీరుకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు.. చిరు సినిమాకు బాక్సాఫీస్ వద్ద బ్రహ్మరథం పట్టారు. దీంతో ఈ సినిమా సంక్రాంతి విన్నర్‌గా నిలవడమే కాకుండా 2026 ప్రారంభంలో అత్యధిక వసూళ్లని రాబట్టిన తొలి ప్రాంతీయ చిత్రంగా రికార్డు సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే హిట్ మెషీన్ అనిల్ రావిపూడి ఫోన్ చేస్తే గూగుల్ చేసిందంట హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కించిన -సంక్రాంతకి వస్తున్నాం- సినిమాతో భాగ్యంగా తనదైన మార్కు నటనతో గోదావరి యాసతో ఆకట్టుకుని సినిమా విజయంలో తనదైన పాత్ర పోషించింది ఐశ్వర్య రాజేష్. అయితే తనకు ఈ సినిమా చేసే వరకు అనిల్ రావిపూడి ఎవరో తెలియదని చెప్పి షాక్ ఇచ్చింది. ఓ పోడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ ఐశ్వర్యా రాజేష్ చేసిన వ్యాఖ్యాలు ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతూ అందరిని షాక్‌కు గురి చేస్తున్నాయి. సుడల్ సిరీస్‌లో నటిస్తున్న సమయంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి నుంచి తనకు కాల్ వచ్చిందట. -అమ్మా నేను అనిల్ రావిపూడిని డైరెక్టర్‌ని మాట్లాడుతున్నాను- అని చెప్పగానే తను ఎవరన్నది అంత వరకు తనకు తెలియకపోవడంతో అనిల్ గురించి గూగుల్ చేసిందట. తన గురించి తెలుసుకున్నాక చెప్పండి సార్ అని అడగడంతో ఆడిషన్‌కి వస్తావా అని అనిల్ అడిగాడట.ఆయన ఆడిషన్ అనగనే నాకు ఒక్క నిమిషం ఏమీ అర్థం కాలేదు. ఆడిషన్ ఇవ్వడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ తెలుగు సినిమాలో ఆడిషన్ అనే సరికి కొంత కంగారు పడ్డాను.

## శేష్ ఔట్.. ఇక యశ్ సంగతే తేలాలి



సంక్రాంతి సినిమాల తర్వాత రెండు నెలలు బాక్సాఫీస్ డల్లుగా ఉండబోతోంది. ఇది ఎప్పుడూ జరిగేదే. మార్చి మూడో వారం నుంచి మళ్లీ క్రేజీ సినిమాలు రిలీజవుతుంటాయి. ఈసారి అప్పుడే రంజాన్ పండుగ ఉండడంతో పాన్ ఇండియా స్థాయిలో అది బాగా డిమాండ్ ఉండే వీకెండ్ కాబోతోంది. ఆ వీకెండ్‌కు చాలా ముందుగానే 'దురంధర్-2' సినిమాను షెడ్యూల్ చేశారు. డిసెంబరు 5న 'దురంధర్' రిలీజైనపుడే ఈ డేట్‌ను ప్రకటించారు. ఐతే సీక్వెల్ మీద హైప్ ఊహించని స్థాయికి చేరిపోవడంతో ఆ అంచనాలను అందుకోవడం కోసం ఆదిత్య ధర్ అండ్ టీం ఇంకా ఎక్కువ ఎఫర్ట్స్ పెట్టొచ్చని.. అందుకోసం సినిమాను వాయిదా వేయొచ్చని ప్రచారం జరిగింది. కానీ అలా ఏమీ జరగలేదు. తక్కువ టైం ఉన్నా సినిమాను అదే డేట్‌కే తీసుకువస్తున్నారు. ఐతే అధికారిక ప్రకటన కోసమే అంతా ఎదురు చూస్తూ వచ్చారు. ఈ రోజు 'దురంధర్-2' టీజర్ లాంచ్ చేస్తూ ఈ విషయాన్ని ధ్రువీకరించింది చిత్ర బృందం. ఈ టీజర్ రావడం ఆలస్యం.. మార్చి 19కే షెడ్యూల్ అయిన అడివి శేష్ మూవీ 'డెకాయిట్' వాయిదా పడిపోయింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న రిలీజ్ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడిక మార్చి 19కే రావాల్సిన యశ్ మూవీ 'టాక్సిక్' సంగతి ఏమవుతుందో చూడాలి. టాక్సిక్ వాయిదా గురించి ఇంతకుముందు వార్తలు వచ్చాయి కానీ.. అలాంటిదేమీ లేదంటూ గత నెలలో రిలీజ్ చేసిన టీజర్లోనూ టీం స్పష్టం చేసింది. 'డెకాయిట్' టీం సైతం టీజర్ లాంచ్ అప్పుడు మార్చి 19కే తమ సినిమా వస్తుందని ధీమా వ్యక్తం చేసింది. కానీ 'దురందర్' రేంజ్ ఇంకా ఇంకా పెరిగిపోవడం, ఓటీటీలో కూడా ఈ చిత్రానికి అద్భుత స్పందన రావడం, పాన్ ఇండియా స్థాయిలో బంపర్ క్రేజ్‌తో 'దురంధర్-2' రిలీజ్ కానుండడంతో 'డెకాయిట్' టీంకు వాస్తవం బోధపడి వాయిదా నిర్ణయం తీసుకుంది. 'టాక్సిక్' టీం ఇప్పటిదాకా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది కానీ.. వారిలోనూ 'దురంధర్-2' తాలూకు భయం ఉంటుందన్నది స్పష్టం.

## బికినీ.. బోల్డ్ సీన్స్.. అసలు విషయం చెప్పిన దివి!



తెలుగు అందం దివి వద్యా గురించి అందరికీ తెలిసిందే. పాపులర్ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 4తో మంచి క్రేజ్ సంపాదించుకున్న అమ్మడు.. ఆ తర్వాత వరుస సినిమాల్లో నటిస్తున్నారు. సూపర్ ఛాన్స్ లు అందుకుని బిజీ బిజీగా గడుపుతున్న దివి.. థియేటర్స్ లో సందడి చేస్తున్నారు. ఇప్పుడు హారర్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ హానీతో మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. పలాస ఫేమ్ దర్శకుడు కరుణ కుమార్ తెరకెక్కించిన ఆ సినిమాలో దివి లీడ్ రోల్ పోషించగా.. టాలీవుడ్ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటించారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకున్న హానీ మూవీని ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్స్ లో విడుదల చేయనున్నారు. రీసెంట్ గా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా దివి కొన్ని బోలిల్డ్ సీన్స్ లో కనపడడం.. ఒక్కసారిగా అందరినీ షాక్ కు గురి చేసింది. ఎందుకంటే.. నెట్టింట అప్పుడప్పుడు హీట్ పుట్టించే పిక్స్ షేర్ చేసే అమ్మడు.. హనీ మూవీలో బోలిల్డ్ సన్నివేశాల్లో కనపడనుందని ట్రైలర్ ద్వారా క్లారిటీ వచ్చింది. అదే విషయాన్ని దివి ముందు ప్రస్తావించారు ఓ మీడియా ప్రతినిధి. "బికినీ పిక్స్ ఇండియా వైడ్ గా వైరల్ అయ్యాయి.. సోషల్ మీడియాను ఊపేశాయి.. డిలీట్ చేసినా ట్రెండింగ్ లో ఉన్నాయి.. హనీ మూవీలో బోలిల్డ్ సీన్స్ లో కనిపించారు. దానికి కారణం కంటెంటా.. రెమ్యూనరేషనా" అని అడగ్గా.. ముందు దివి చిన్న స్మైల్ ఇచ్చారు. ఆ తర్వాత సినిమా చేయడానికి రీజన్ కాన్సెప్ట్ అని తెలిపారు.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B-258, Phase-1, Vanasthalipuram, Hyderabad-70. Printed at **Garuda Printers**, H.No :2-86/1, Plot No. 23 -SP, Sy.No.417, Sagar High Way. Ragannaguda Village, Abdullapurmet (M), Rangareddy Dist, Telangana State- 501510 , **Published at :** H.No.Plot no.1, Bhagya laxmi Towers, opp: GHMC, L.B.Nagar Circle, venkateswara Colony, Saroornagar, Ranga Reddy Dist. Hyderabad-500035,Telangana State, **Editor :B. Pramod Kumar**, **RNI No: TELTEL/2021/81803**